నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA
Digital Editions
www.nirbhayavaartha.in
https://nirbhayavaartha.in

నిర్భయవార్త
తెలుగు దినపత్రిక
NIRBHAYA VARTHA TELUGU DAILY



సంపుటి : 13 సంచిక : 186 రంగారెడ్డి | శనివారం 07 నవంబర్ 2026 | ఎడిటర్ : బవనారి రవికుమార్ | 07-11-2026 November | పేజీలు : 8 | వెల : రూ॥ 1-00

Circulated To: Hyderabad-Rangareddy-Nizamabad-Warangal-Mulugu-Yadadri-Nalgonda-Karimnagar-Khammam-Medak-Sangareddy-Siddipet-Medchal-Jagityal-Vemulawada

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు
మంత్రి సీతక్క గుడ్‌న్యూస్..
రూ.350 సిమెంట్ బస్తా రూ.230కే!



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

వెంకటాపూర్, రామప్ప: ములుగు జిల్లా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. పేదరికం లేని సమాజ నిర్మాణం, గ్రామాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. శుక్రవారం వెంకటాపూర్ మండలంలో పర్యటించిన మంత్రి రూ.3 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించడంతో పాటు పలు సంక్షేమ పథకాలపై కీలక ప్రకటనలు చేశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిమెంట్ రాయితీ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి సీతక్క శుభవార్త చెప్పారు. ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయంతో పాటు నిర్మాణ సామగ్రిని కూడా రాయితీ ధరలకు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మార్కెట్‌లో సిమెంట్ బస్తా ధర రూ.300 నుంచి రూ.350 వరకు (మిగతా 6లో..)

తెలంగాణలో నీళ్లే కాదు ఇక పాలకూ కష్టమే..
భారీగా పడిపోయిన పాల ఉత్పత్తి




నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

ఎల్ నినో ప్రభావం వ్యవసాయం మీదనే కాదు.. పాడి పరిశ్రమపైనా పడింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో సాగు బడి గణనీయంగా తగ్గింది. దీంతో పశుగ్రాసం కొరత ఏర్పడి పాల ఉత్పత్తి భారీగా పడిపోయింది. నీరు, గ్రాసం, దాణా కొరత ఏర్పడి గతంలో 10 లీటర్ల పాలు ఇచ్చే గేదె ప్రస్తుతం 5 లీటర్లకే పరిమితం అయింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాష్ట్రంలో నీళ్లే కాదు.. పాలు కూడా దొరకని పరిస్థితి నెలకొనే ప్రమాదం పొంచి ఉంది.

రాష్ట్రానికి ఎన్ని లీటర్ల పాలు అవసరం?

వ్యవసాయానికి ఆయువు పట్టుగా ఉన్న తెలంగాణలో రోజురోజుకు పశుపోషణ తగ్గిపోతున్నట్టు గణంకాలు తెలుపుతున్నాయి. గత ఐదేళ్లలో పశువుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 0.87 శాతం మంది రైతు కుటుంబాలే పాడి పశువులతో ఉపాధి పొందుతున్నారు. వీరంతా కూడా పాతతరం రైతులే కావడం గమనార్హం. జెన్ జీ ఉత్సహం చూపించకపోవడంతో వ్యవసాయంతోపాటు పాడి పరిశ్రమ (మిగతా 6లో..)

తెలంగాణలో ఇంటింటికీ ఇంటర్నెట్



నిర్భయవార్త ప్రతినిధి :, హైదరాబాద్ :

తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి ఇంటా వేగవంతమైన ఇంటర్నెట్ సేవలు అందించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు మార్గం సుగమమైంది. కేంద్ర ప్రభుత్వపు అమెండెడ్ భారత్ నెట్ ప్రోగ్రామ్ కింద తెలంగాణ రాష్ట్రంలో రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌ను బలోపేతం చేసేందుకు కేంద్రంతో ఒప్పందం పూర్తయింది. ఢిల్లీలోని సంచార్ భవన్‌లో జరిగిన తొలి బోర్డు సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున ఐఏఎస్ అధికారి అనుదీప్ దురిశెట్టి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

రూ. 3,185 కోట్ల కేంద్ర నిధులు..

ఈ ఒప్పందం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి రూ. 3,185 కోట్ల భారీ నిధులు సమకూరనున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'తెలంగాణ రాష్ట్ర (మిగతా 6లో..)

మా డిమాండ్‌కు తలొగ్గే
ఎస్టీలకు ప్రత్యేక కమిషన్
కల్వకుంట్ల కవిత



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన డిమాండుకు తలొగ్గే ప్రభుత్వం ఎస్టీలకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చిందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఎస్సీ, ఎస్టీ కమిషన్లను కలిపి ఒకే కమిషన్‌గా ఏర్పాటు చేయడంతో అటు ఎస్సీలకు, ఇటు ఎస్టీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని పలుమార్లు తాము ప్రశ్నించామని గుర్తుచేశారు. సమాజంలో ఎస్సీలు, ఎస్టీలు ఎదుర్కొంటున్న సామాజిక, భౌగోళిక సమస్యలు పూర్తిగా వేర్వేరుగా ఉన్నాయని పేర్కొన్నారు. నేటికీ ఎస్సీలు సమాజంలో పీడన, అణచివేత, దౌర్జన్యాలను ఎదుర్కొంటుంటే, మరోవైపు ఆదివాసీలను రకరకాల పేర్లతో అడవి నుంచి దూరం చేసే కుట్రలు జరుగుతున్నాయని తెలిపారు. గిరిజనులు తమ అస్తిత్వమైన జల్-జంగల్-జమీన్‌పై హక్కులను కోల్పోయే ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆదివాసీలు, గిరిజన సమాజం అభ్యున్నతి కోసం ప్రత్యేక ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించడం వారికి మంచి చేస్తుందని పేర్కొన్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఎస్టీ కమిషన్ గిరిజనుల ఆకాంక్షలకు ప్రతీకగా నిలవాలని.. వారి ఆత్మగౌరవాన్ని, విశిష్టమైన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించేలా పనిచేయాలని ఆకాంక్షించారు.

విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలి..
అరెస్ట్ చేస్తారా? : కేటీఆర్



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

ప్రభుత్వ పెద్దలు, కాంగ్రెస్ నేతలు చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రశ్నించినందుకు బీఆర్ఎస్ నాయకుడిని అరెస్టు చేస్తారా అని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 'ఎక్స్'లో ప్రశ్నించారు. దూదిమెట్ల బాలరాజు యాదవ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. రాజకీయ విమర్శలకు సమాధానం రాజకీయంగానే చెప్పాలి తప్ప (మిగతా 6లో..)

నదుల్లో నీళ్లున్నా పొలాలకు ఇవ్వలేని దౌర్భాగ్యం..
ఇది రేవంత్ వృష్టి : హరీష్ రావు



నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన అనాలోచిత కరువు అని మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఇది అతివృష్టి, అనావృష్టి కాదని.. కేవలం 'రేవంత్ వృష్టి' మాత్రమేనని అభివర్ణించారు. నదుల్లో కావాల్సినంత నీటి లభ్యత ఉన్నప్పటికీ, పంపులు నడిపి నీళ్లను ఎత్తిపోసే చేతగానితనాన్ని ఈ ప్రభుత్వం ప్రదర్శిస్తోందని ధ్వజమెత్తారు.శనివారం జరగబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆధారాలతో సహా కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడతామని స్పష్టం చేశారు.దేవాదుల ప్రాజెక్టు ద్వారా 60 టీఎంసీల నీటిని ఎత్తే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం కేవలం 18 టీఎంసీలతో సరిపెట్టిందని హరీష్ రావు ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి నీటిని కిందకు వదిలేస్తుంటే.. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ నీటిని ఒడిసి పట్టుకున్నారని పేర్కొన్నారు. శ్రీశైలంలో సరిపడా నీళ్లు ఉన్నప్పటికీ కల్వకుర్తి ఎత్తిపోతల వద్ద పూర్తిస్థాయిలో మోటార్లు నడపడంలో ప్రభుత్వం విఫలమైందని, మరోవైపు చంద్రబాబు నాయుడు ఏకంగా 700 కిలోమీటర్ల దూరంలో ఉన్న కుప్పం వరకు నీటిని తరలించుకుపోయారని గుర్తుచేశారు.గ్లోబల్ వార్మింగ్, 'ఎల్ నినో' ప్రభావం వస్తుందని శాస్త్రవేత్తలు ముందుగానే హెచ్చరించినా ప్రభుత్వం ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో పంటల బీమా గురించి గొప్పలు చెప్పిన కాంగ్రెస్ నాయకులు, అధికారంలోకి వచ్చాక దానిని అమలు చేయడం మరచిపోయారని.. (మిగతా 6లో..)

వంద దేశాల నుంచి
ప్రతినిధులు రాక

నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :



ప్రపంచ స్థాయి వేదికకు హైదరాబాద్ సిద్ధమవుతోంది. ఈనెల 12, 13, 14 తేదీలలో నగరంలోని ప్రసిద్ధ 'హైటెక్స్' ప్రాంగణంలో ప్రతిష్టాత్మక 'భారత్ సమ్మిట్' నిర్వహించనున్నారు. వివిధ దేశాల మధ్య నత్సంబంధాలను మరింత పెంపొందించడం, అంతర్జాతీయ సహకారాన్ని విస్తరించడమే లక్ష్యంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఈ సదస్సును నిర్వహిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 100 దేశాల నుంచి దౌత్యవేత్తలు, (మిగతా 6లో..)

గౌరవెల్లి ప్రాజెక్టుతో హుస్నాబాద్ రూపురేఖలు మారుస్తాం..
మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటన!

స్టార్ త్రినేత్రం, హైదరాబాద్ :



హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసి హుస్నాబాద్ నియోజక వర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో సాగునీటి ప్రాజెక్టులతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. హుస్నాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పలు కీలక విషయాలను వెల్లడించారు.

గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులకు ప్రాధాన్యం

2007లో ప్రారంభమైన గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని మంత్రి తెలిపారు. ఇందుకోసం అవసరమైన నిధులు మంజూరు చేయించామని, సుప్రీంకోర్టులో ఉన్న కేసును పరిష్కరించుకున్నామని చెప్పారు. కాలువల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి (మిగతా 6లో..)

నిర్భయవార్త

సంపాదకీయం

శనివారం 07 నవంబర్ 2026

ప్రమాదకరం..

సంక్షేమ పథకాల ప్రయోజనాలు పొందేందుకు ఆధార్‌కు బదులుగా ఓటరు గుర్తింపు కార్డుతోపాటు బయోమెట్రిక్ ధ్రువీకరణను తప్పనిసరి చేస్తామని కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడం గోరుచుట్టుపై రోకలిపోటులా ఉంది. ఒకవైపు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పేరుతో కోట్లాది మంది ఓటు హక్కుకు ముప్పు తెస్తూ, మరోవైపు అదే ఓటరు కార్డును సంక్షేమ పథకాల అర్హతకు ప్రాతిపదికగా మార్చాలనుకోవడం దారుణం. ఓటరు జాబితాలో పేరులేని వారికి సంక్షేమ పథకాలను నిలిపివేయాలనుకోవడం ప్రమాదకరమైన ఆలోచన. ఆధార్‌ను దేశంలోని ప్రతి పౌరుడికీ విశ్వసనీయమైన గుర్తింపుగా గతంలో మోడీ ప్రభుత్వమే ఊదరగొట్టింది. బ్యాంకు ఖాతాలు, రేషన్, పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలతో దాన్ని అనుసంధానించింది. ఆధార్ తప్పనిసరి కాదని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చినప్పటికీ, ఆచరణలో అనేక సంక్షేమ సేవలకు దాన్నే కీలక ఆధారంగా మార్చింది. ఇప్పుడు అదే ఆధార్‌ను పక్కనపెట్టి ఓటరు కార్డును ముందుకు తేవడం ప్రజల ప్రయోజనాలతో ఆటలాడే క్రూరమైన చర్య.బయోమెట్రిక్ విధానం వల్ల గ్రామీణ పేదలు ఇప్పటికే అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కఠినమైన శారీరక శ్రమతో వ్యవసాయ, నిర్మాణ రంగ కార్మికుల వేలిముద్రలు అరిగిపోవడం, వృద్ధుల వేలిముద్రలు యంత్రాలకు సరిగా చిక్కకపోవడం, కొందరి కనుపాపలను ఐరిస్ స్కానర్లు గుర్తించలేకపోవడం వల్ల అర్హులకు అందాల్సిన ప్రయోజనాలు నిలిచిపోతున్నాయి. ఇ-కెవైసీకి అవసరమైన స్మార్ట్‌ఫోన్లు అనేక గ్రామీణ కుటుంబాలకు అందుబాటులో లేవు. దేశంలో 8,985 గ్రామాలకు మొబైల్ నెట్‌వర్క్ సౌకర్యం లేదని కేంద్ర ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో బయోమెట్రిక్‌ను తప్పనిసరి చేయడం మూలిగే నక్కపై తాటిపండు పడినట్టే అవుతుంది. కాకినాడ జిల్లా కొవ్వూరు సమీపంలో మే 16న జరిగిన రోడ్డు ప్రమాదం డిజిటల్ విధానాల దుష్పరిణామాలకు నిదర్శనం. పని ప్రదేశంలో మొబైల్ సిగ్నల్ లేకపోవడంతో ఉపాధి హామీ కూలీలు బయోమెట్రిక్ నమోదు కోసం నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న రహదారి ప్రాంతానికి వెళ్లారు. ఆ క్రమంలో లారీ ఢీకొని నలుగురు మహిళా కూలీలు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పని ప్రదేశంలోనే హాజరు నమోదు చేసుకునే సదుపాయం ఉంటే వారు రహదారిపైకి వెళ్లాల్సిన అవసరం వచ్చేది కాదు. గ్రామీణ ప్రాంతాల్లో బయోమెట్రిక్ నమోదు ఇంతటి తీవ్ర సమస్యగా ఉన్నప్పటికీ ఇప్పుడు ఓటరు కార్డును కూడా జోడించి, మరింత కఠినతరం చేయాలనుకోవడం బాధ్యతారాహిత్యం.ఏకపక్షంగా, అస్తవ్యస్తంగా సాగిన ఎస్ఐఆర్ ప్రక్రియ దేశవ్యాప్తంగా 13.5 కోట్ల మందికి ఓట్లు లేకుండా చేసింది. గోవాలో ఓటు కోల్పోయిన వారిలో 97 మంది తిరిగి ఓటు పొందడానికి సాంకేతిక, అధికార కేంద్రీకరణ లోపాలు ఎలా అడ్డంకిగా మారాయో చూశాం. పశ్చిమ బెంగాల్‌లో తుది జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించారు. తొలగింపులను సవాలు చేస్తూ దాఖలైన అప్పీళ్లలో ఆగస్టు 7 నాటికి పరిష్కారమైన కేసుల్లో 91 శాతానికి పైగా ఓటర్లను తిరిగి జాబితాలో చేర్చాల్సి వచ్చింది. తొలగింపు ప్రక్రియలోని లోపాలకు ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే! ఎస్ఐఆర్‌పై దేశవ్యాప్తంగా అభ్యంతరాలు, ఆందోళనలు కొనసాగుతుండగానే ఎన్నికల సంఘం మరో ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్‌ను ప్రకటించింది. ప్రజల ఆందోళనలను పట్టించుకోని మోడీ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి ఇది నిదర్శనం. ఆరునూరైనా తన మాటే చెల్లుబాటు కావాలని, తాను చేస్తున్నదంతా సరైనదేనని చెప్పుకునే ధోరణిలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరించటం దారుణం.పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ), జాతీయ పౌరసత్వ నమోదు (ఎన్ఆర్‌సి) ప్రతిపాదనలపై గతంలో దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు వ్యక్తమయ్యాయి. పౌరసత్వాన్ని మత ప్రాతిపదికన వర్గీకరించడం, పౌరులు తమ పౌరసత్వాన్ని పత్రాలతో నిరూపించుకోవాల్సిన పరిస్థితి కల్పించడంపై నిరసనలు వెల్లువెత్తాయి. ఆ చట్టాల దురుద్దేశాలే ఎస్ఐఆర్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. మైనారిటీలు, పేదలు, వలస కార్మికులు పెద్ద సంఖ్యలో ఓటు హక్కును కోల్పోయారు. ఇప్పుడు వారికే సంక్షేమ పథకాలను నిలిపివేయాలనే ప్రతిపాదన అమానవీయమైనది మాత్రమే కాదు; హక్కుల ఉల్లంఘన కూడా! ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఎస్ఐఆర్‌లో పేర్లు తొలగించారనే సాకుతో రేషన్, ఇతర సంక్షేమ ప్రయోజనాలను నిరాకరిస్తున్నారు. ఓటు హక్కు, ఆహారం పొందే హక్కు, ఉపాధి, పింఛను, వైద్యం వంటి సామాజిక భద్రతా హక్కులు వేర్వేరు. బయోమెట్రిక్ ధ్రువీకరణ విఫలమైనంత మాత్రాన అర్హులకు సంక్షేమ ప్రయోజనాలు నిరాకరించరాదని ఆధార్ చట్టం కూడా స్పష్టం చేస్తోంది. సాంకేతిక వైఫల్యానికి పరిష్కారం చూపాల్సిన ప్రభుత్వాలే ఆ వైఫల్యాన్ని ప్రజల అనర్హతగా పరిగణించడం దుర్మార్గం. గుర్తింపు కార్డులు ప్రజలకు సేవలు అందించడానికి ఉపయోగపడాలి తప్ప, సేవలను నిరాకరించడానికి ఆయుధాలుగా మారకూడదు. ఓటరు గుర్తింపును సంక్షేమానికి తప్పనిసరి షరతుగా మార్చే ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలి. ఎలాంటి సాంకేతిక ఆంక్షలు లేకుండా అర్హులైన ప్రజలందరికీ సంక్షేమ ప్రయోజనాలు అందించాలి

చిన్నారులపై ఆగని ఆకృత్యాలు

అక్టోబర్ 31న అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై విద్యుత్ రంపంతో జరిగిన దాడి సభ్యసమాజాన్ని కుదిపేసింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. చదువుల మధ్య తరగతి గదిలోకి చొరబడి బాలికపై దాడి చేయడాన్ని ఎంత తీవ్రంగా ఖండించినా తక్కువే. విద్యాలయం పిల్లలకు భద్రతనిచ్చే ప్రదేశం. అక్కడే ప్రాణభయం ఎదురైతే తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి? దాడి వెనుక ఉద్దేశం ఏమిటన్నది దర్యాప్తులో తేలాలి; కానీ ఏ ఉద్దేశమూ ఈ క్రూరత్వాన్ని సమర్థించలేదు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థినులు కోలుకోవడం ఇప్పుడు అత్యంత ముఖ్యం. వారిని కేవలం వార్తల్లోని బాధితులుగా చూడకుండా, చికిత్స అనంతరం చదువును కొనసాగించగల వాతావరణం కల్పించాలి. నిందితుడి ఉద్దేశంపై ఊహాగానాలతో బాలిక వ్యక్తిత్వాన్ని ప్రశ్నించడం మరో రకమైన అన్యాయం.ఇది ఒక్క పాఠశాల సమస్యగా చూడరాదు. మహిళల నిర్ణయాలను తేలికగా తీసుకోవడం, వారి తిరస్కరణను అవమానంగా భావించడం, ఆధిపత్యాన్ని పురుషత్వంగా పొరబడటం వంటి ధోరణులు హింసకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. ప్రేమకు మూలం పరస్పర సమ్మతి; బలవంతానికి ప్రేమ అనే పేరు పెట్టడం దాని అర్థాన్నే అవమానించడం. కుటుంబాల్లో బాలురకు ఆడపిల్లల స్వేచ్ఛను గౌరవించడం, కోపాన్ని అదుపుచేసుకోవడం, తిరస్కరణను హుందాగా స్వీకరించడం నేర్పాలి. 'వద్దు' అనే మాటకు గౌరవం ఇవ్వడం మానవ సంబంధాలకు పునాది. వేధింపులను ప్రేమగా, దౌర్జన్యాన్ని ధైర్యంగా చూపే కథనాలపై కూడా సమాజం విమర్శనాత్మకంగా ఆలోచించాలి. స్త్రీని తన నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర వ్యక్తిగా చూడలేని మనస్తత్వం మారకపోతే చట్టాలున్నా భయం తొలగదు.జాతీయ నేర గణాంకాల సంస్థ ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా మహిళలపై 4,41,534 నేరాలు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 1,210 కేసులు. వాటిలో భర్త లేదా బంధువుల క్రూరత్వానికి సంబంధించినవి 1,20,227; అత్యాచార కేసులు 29,536; బాలికలు బాధితులుగా ఉన్న పోక్సో కేసులు 67,809. అత్యాచార కేసుల్లో 96.8 శాతం సందర్భాల్లో నిందితులు బాధితులకు పరిచయస్థులే. 2023తో పోలిస్తే 2024లో నమోదైన మొత్తం కేసులు స్వల్పంగా తగ్గినా, ఈ సంఖ్యలు భద్రతపై నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వవు. ఫిర్యాదుగా నమోదు కాని బాధలు వీటికి అదనం. కేసుల సంఖ్యలో స్వల్ప తగ్గుదల కొంత ఊరటనిచ్చినా, నిజమైన పురోగతిని మహిళలు ఎంత నిర్భయంగా జీవిస్తున్నారన్న ప్రమాణంతోనే కొలవాలి. ప్రతి ఫిర్యాదు వెనుక ఒక మనిషి జీవితం, కుటుంబం, భవిష్యత్తు ఉన్నాయని మరచిపోకూడదు.నేరం జరిగిన తరువాత శిక్ష కోరడం అవసరం; నేరం జరగకుండా చూడటం మరింత అవసరం. పాఠశాలల్లో ప్రవేశ నియంత్రణ, వేధింపులపై సత్వర స్పందన, విద్యార్థులకు గోప్యంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలి. బాధితులకు మెరుగైన వైద్యం, మానసిక సహాయం, న్యాయపరమైన రక్షణ అందించాలి. బాలికలపై ఆంక్షలు పెంచడం భద్రత కాదు; వారిపై హింసకు దారితీసే ప్రవర్తనను అడ్డుకోవడమే నిజమైన రక్షణ. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేస్తే వేధింపుల సంకేతాలను ముందుగానే గుర్తించవచ్చు. దర్యాప్తు వేగంగా, నిష్పాక్షికంగా సాగాలి; నేరం రుజువైతే చట్టప్రకారం కఠినశిక్ష పడాలి. బాధితురాలికే జాగ్రత్తలు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోవడం సమాజానికి తగదు.రాప్తాడు ఘటన మరో వార్తగా మిగిలిపోకూడదు. ఒక బాలిక భయపడకుండా పాఠశాలకు వెళ్లి సురక్షితంగా ఇంటికి చేరే హక్కును కాపాడల ేని సమాజం తన అభివృద్ధిని ఎలా గొప్పగా చెప్పుకోగలదు? మహిళలను గౌరవి ంచడం ఉపన్యాసాల్లో కాదు, ప్రతి ఇంటి సంస్కారంలోనూ ప్రతి సంస్థ ఆచర ణలోనూ కనిపించాలి. మహిళల భద్రత దాతృత్వం కాదు; అది వారి హక్కు, మన నాగరికతకు అసలైన ప్రమాణం

(హెచ్. ప్రతాప్)

హక్కుల దొంగలకు శిక్ష ఖాయం!



ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీ గొంతుకో కాదు. కేవలం రాజకీయ నేతల గొంతు కూడా కాదు. ఇది ఈ దేశంలోని యువత గొంతు. రైతుల గొంతు. కష్టజీవుల గొంతు. మొత్తానికి మొత్తంగా ఇది ఈ దేశ ప్రజల గొంతు. ఈ దేశ రాజ్యాంగానికి దెబ్బ తగలకుండా కాపాడుకునేందుకు ముందుకొచ్చిన ఈ దేశ పౌరుల గొంతు. కేంద్రంలోనే కాదు, ప్రతి రాష్ట్రంలోనూ ఓట్ చోరీ జరిగింది. అన్ని సాక్ష్యాలూ, అన్ని ఆధారాలూ ముందుకొచ్చాయి. కొంత కాలంగా దేశంలోని మేధావులంతా వాటిని ప్రజలకు వివరిస్తూనే ఉన్నారు. బాధ్యత గల ప్రభుత్వం ఎప్పటికప్పుడు, ఎక్కడికక్కడ వివరణలు ఇవ్వాలి కదా? ఇవ్వలేదు. జవాబుదారీతనం లేని ప్రభుత్వం అవసరమా? ఆ పనిలో భాగంగానే ఊహించని రీతిలో ఈ దేశ పౌరులు నవంబర్ 1న ఢిల్లీ-రామ్‌లీలా మైదాన్‌లో గుమిగూడారు. తమ హక్కులను దొంగిలించిన ప్రభుత్వం మీద విరుచుకుపడ్డారు. 2024 ఎన్నికల తర్వాత దేశంలోని 13.5 కోట్ల మంది ఓట్లు మాయం చేసింది ఈ ఆర్.ఎస్.ఎస్, బిజెపి ప్రభుత్వం! అంటే, ఈ దేశ జనాభాలో 15 శాతం మంది ఓటు హక్కు కోల్పోయారు. ప్రజలు నాయకులను ఎన్నుకోవడం చూశాం. కాని, ఇక్కడ నాయకులు ప్రజలను ఎన్నుకుంటున్నారు. ఇది ఎప్పుడూ, ఎక్కడా లేని విచిత్రమైన పరిస్థితి. ఈ నరేంద్ర మోడీ ప్రభుత్వం 'ఓట్ చోరీ' చేసి, దొంగతనంగా అధికారాన్ని ఆక్రమించింది. విషయాలన్నీ సామాన్య ప్రజలకు అర్థమయ్యాయి. అందుకే న్యాయం కావాలంటున్నారు. అక్రమ మార్గంలో ఎన్నికలు జరిపించిన జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయడమే కాదు, జైలుకు కూడా వెళ్లాల్సి వుంటుంది. జ్ఞానేష్ కుమార్‌ను ఉపయోగించుకుని అధికారం దక్కించుకున్న మోడీ, అమిత్ షా, వారి మంత్రి వర్గంలోని వారంతా దోషులే. ఎవరూ తప్పించుకుని పోలేరు. చేసిన దుర్మార్గాలకు శిక్షలు అనుభవించాల్సిందే! ఇది మామూలు దొంగతనం కాదు, పౌరుల ప్రాథమిక హక్కులను దొంగిలించడం. భావ ప్రకటనా స్వేచ్ఛను దొంగిలించడం. పౌరులు సజీవంగా వున్నారు. కానీ, ఓట్ చోరీ వల్ల వారంతా చనిపోయిన వాళ్ల కిందే లెక్క! ఓటు హక్కు లాగేయడమంటే మాటలు కాదు. సజీవంగా ఉంచుతూనే హత్య చేయడం. ఇది కూడా ఒకరకంగా గుజరాత్, మణిపూర్ మారణకాండ లాంటిదే- ఈ హత్యలకు పాల్పడింది మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్. వీరిని మించిన దేశద్రోహులు మరెవ్వరూ లేరు.విద్యా రంగం, వైద్య రంగం, సిబిఐ, ఇ.డి, న్యాయ వ్యవస్థ, పోలీసు యంత్రాంగం, అధికార గణం - ఇవన్నీ ఎవరివీ? ఈ దేశ పౌరులవి ! ఎవరి కోసం పని చేయాలీ? ఈ దేశ ప్రజల కోసం పని చేయాలి! కానీ, ఇవన్నీ అధికారంలో ఉన్న ఒకరిద్దరి స్వార్థ ప్రయోజనాల కోసం పనిచేస్తున్నాయి. ఈ వ్యవస్థలన్నీ భవిష్యత్ తరాలవారివి. యువతకు వీటి మీద అధికారం ఉంది. కానీ, ఈ వ్యవస్థలన్నీ ఏం చేస్తున్నాయి? అన్యాయంగా వారిని అణచివేస్తున్నాయి. వ్యవసాయ రంగానికి న్యాయం జరగడం లేదు. యువతకు ఉపాధి లేదు. విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించారు. కనీసం రోజుకూ లీల శ్రమకు తగిన ఫలితం దక్కడం లేదు. మరి డబ్బంతా ఎటుపోతోంది? అదానీ, అంబానీలకు పోతోం ది. విద్యుత్ వ్యవస్థ అదానీది, మొబైల్ అదానీది, డ్రోన్ అదానీది, ఆయుధం అదానీది. మొత్తానికి మొత్తం దేశమంతా అదానీదేనా? వారికి వేల వేల కోట్ల రుణ మాఫీ లభిస్తోం ది. సామాన్యులు మాత్రం నరక ్యాతన పడాల్సి వస్తోం ది.నిరంతరం కష్టించి పనిచేస్తున్న రైతుకు శ్రమ ఫలితం దక్కనవసరం లేదా? రోజూ పద్దెనిమిది గంటలు కష్టపడి చదువుకుంటున్న విద్యార్థికి ఇంత జ్ఞానం సంపాదించుకునే అవకాశం అక్కరలేదా?ఈ పరిస్థితిని మార్చుకోవడానికి మనమంతా అప్రమత్తతతో ఉండాలి. ప్రభుత్వ దుష్ట ప్రయత్నాలను అడ్డుకుంటూ ఉండాలి. ఈ దేశాన్ని మళ్ళీ గాడిలో పెట్టాలి. అది జ్ఞానేష్ కుమార్ రాజీనామాతో ప్రారంభం కావాలి! "నరేంద్ర మోడీ ఎక్కడికీ పోవడం లేదు కదా?" అని అమిత్ షా ప్రతిపక్షాల్ని ఎద్దేవా చేస్తూ మాట్లాడారు. అతను ఒకటి గుర్తు పెట్టుకోవాలి. ప్రతిపక్షాలు కూడా ఎక్కడికీ పోవడం లేదు. ఈ దేశ ప్రజలూ ఎక్కడికి పోవడం లేదు. ప్రస్తుత పరిస్థితుల నుండి తప్పించుకోవడానికి మోడీ-షాలు ఎటైనా పారిపోవాలని ప్రయత్నించినా లాభం లేదు. ఈ దేశ ప్రజలు కాపలా కాస్తున్నారు. ప్రతిపక్షాలు కాపలా కాస్తున్నాయి. యువత అంతా కాపలా కాస్తోంది. వీరు చేస్తూ వచ్చిన అరాచకాలకు ఈ దేశంలోనే శిక్ష అనుభవించక తప్పదు. తప్పదు- దేశాన్ని కార్పొరేట్లకు అమ్మిన నేరానికి, ఓట్ చోరీకి శిక్ష తప్పదు.

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడువు లోగా పూర్తి చేయాలి ... జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్

బేతుపల్లి చెరువులో చిక్కుకున్నవారిని రాత్రింబవళ్లు శ్రమించి రక్షించిన ఖమ్మం జిల్లా కలెక్టర్‌ను అభినందించిన సీఎస్ సంజయ్ జాజు.

ఖమ్మం, నవంబర్- 06 నిర్భయవార్త రిపోర్టర్. ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ డాక్టర్ పి శ్రీజ తో కలిసి ఐడీఓసీ నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. త్రాగునీటి సరఫరా, పీఎంశ్రీ పాఠశాలలు, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగం, ఇందిరమ్మ ఇళ్లు, వీబీ గ్రామీణ ఉపాధి హామీ పథకం, తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో ప్రైవేట్ బోర్‌వెల్స్ ను వినియోగించుకోవడం, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం, కొత్త బోర్లను ఏర్పాటు చేయడం వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ పనులను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని సూచించారు.

జిల్లా స్థాయిలో డీపీఓ, మిషన్ భగీరథ ఈఈ, పబ్లిక్ హెల్త్ అధికారులు తదితరులతో వారం వారీగా సమీక్ష కమిటీని ఏర్పాటు చేయాలని, మండల స్థాయి కమిటీలను నవంబర్ నెలాఖరులోగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. చేతి పంపులు, బోరు పంపులు, బావుల మరమ్మతులను నవంబర్ 15వ తేదీలోగా పూర్తి చేయాలని, నవంబర్ 15 నుంచి డిసెంబర్ 31 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి త్రాగునీటికి సంబంధించిన సమస్యలన్నింటిని పరిష్కరించాలన్నారు. మిషన్ భగీరథ వాల్వుల ద్వారా నీటి వృథాను అరికట్టడంతో పాటు అక్రమ నీటి కనెక్షన్లను నివారించాలని



సూచించారు.**పీఎం శ్రీ, సమగ్ర శిక్షా అభియాన్ నిధుల వినియోగం:** పీఎం శ్రీ పాఠశాలలకు కేటాయించిన నిధులను వూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో తరగతి గదులు, మరుగుదొడ్లు, మరమ్మతులు తదితర మౌళిక వసతుల పనులను ప్రాధాన్యతతో చేపట్టాలన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ 2026--27 సంవత్సరానికి సంబంధించిన నిధులను కూడా వూర్తిగా వినియోగించుకునేలా కార్యాచరణ రూపొందించాలని, ఈ నిధుల వినియోగంపై ముఖ్యమంత్రి ప్రతి పది రోజులకు ఒకసారి సమీక్షిస్తున్నందున, వసుల వురోగతిని ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలన్నింటి పురోగతిని సీఎం డ్యాష్‌బోర్డులో నమోదు చేయాలని, నిధుల వినియోగంలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదన్నారు. పాఠశాలలను అధికారులు తరచూ సందర్శించి విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం, అల్పాహారం నాణ్యతను పరిశీలించాలన్నారు.

వీబీజీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం: వీబీజీ రామ్ జీ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. మార్చి నెలాఖరు నాటికి నిర్దేశించిన పనిదినాల లక్ష్యాన్ని సాధించేలా చర్యలు చేపట్టాలనీ, గ్రామాల్లో అవసరమైన పనులను గుర్తించి నాణ్యతతో చేపట్టడంతో పాటు కూలీలకు నిరంతరం ఉపాధి కల్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. **బేతుపల్లి చెరువులో చిక్కుకున్నవారిని కాపాడిన జిల్లా యంత్రాంగం పనితీరును అభినందించిన సీఎస్:** బేతుపల్లి చెరువులో చిక్కుకున్నవారిని రాత్రింబవళ్లు శ్రమించి, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేస్తూ జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ సురక్షితంగా రక్షించడంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ప్రత్యేకంగా అభినందించారు. అత్యవసర, ఆందోళనకర పరిస్థితుల్లో ప్రజల ప్రాణాలను కాపాడేందుకు ఖమ్మం జిల్లా కలెక్టర్ చూపిన చొరవ, నాయకత్వం అందరికీ ఆదర్శమని సీఎస్ ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర సిఎస్ కు వివరిస్తూ ఖమ్మం--దేవరపల్లి జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి 98 శాతం అవార్డులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ తెలిపారు. మిగిలిన రూ.3 కోట్ల విలువైన అవార్డులకు సంబంధించి టోకెన్లు జనరేట్ అయ్యాయని, చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. వీడియో సమావేశం అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతం చేసి నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎస్ సూచనల మేరకు ప్రతి అంశంపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో వేగం, పారదర్శకత, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. ప్రతి శాఖకు నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్ పనులపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ సమస్యలను గుర్తించి తక్షణమే పరిష్కరించాలని, ప్రజలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పూర్తి స్థాయిలో అందేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఆర్డీవో కె. శ్రీరామ్, డిపిఓ వినోద్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ఇ యుగంధర్ రావు, మిషన్ భగీరథ ఇఇ వాణిశ్రీ, జిల్లాలోని మునిసిపాలిటీ ల కమిషనర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైన రోగులకు ఐ.కె సిటీ స్కానింగ్ సదుపాయంఏరియా ఆసుపత్రికి అత్యాదూతనమైన తెలంగాణ డయాగ్నొస్టిక్ ల్యాబ్ మంజూరు

డయాగ్నస్టిక్ ల్యాబ్ సిటి స్కానింగ్ కొరకు అనువైన భవనాలు పరిశీలన

భద్రాచలం ఏరియా ఆసుపత్రిని సందర్శించిన ఎమ్మెల్యే డా. టి. వెంకటరావు, ఐటీడీఏ పీఓ రాహుల్



భద్రాచలం అక్టోబర్ నిర్భయ వార్త ప్రతినిధి. భద్రాచలం ఏరియా హాస్పిటల్ నాలుగు రాష్ట్రాల ప్రజలకు అనువైన కేంద్రంగా ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి 24 గంటలు రోగులు వస్తూ ఉంటారని వారికి అధునాతనమైన సౌకర్యాలతో వైద్య పరికరాలు అందుబాటులో ఉంచి ఆసుపత్రికి వచ్చిన రోగులు పూర్తిస్థాయిలో వైద్యం చేయించుకొని వెళ్లే విధంగా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మరియు ఐటీడీఏ పిఓ బి.రాహుల్ అన్నారు. శుక్రవారం భద్రాచలం ఏరియా ఆసుపత్రిని వారు సందర్శించి ప్రభుత్వం మంజూరు చేసిన అత్యాదూతనమైన తెలంగాణ డయాగ్నస్టిక్ ల్యాబ్, సిటీ స్కానింగ్ సదుపాయం ఏర్పాటు కొరకు అనువైన భవనాలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించి, ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను నేరుగా అడిగి వారి అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. ఆసుపత్రి అంతటా కలియతిరిగి వైద్య సేవలు, మౌలిక సదుపాయాలను తిలకించారు. అనంతరం వారు మాట్లాడుతూ మారుమూల ప్రాంతాల నుండి వివిధ రకాల జబ్బులతో ఆసువత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండేలా ఆసుపత్రిలో ఏర్పాటు #ప్రతిష్ఠాత్మక CT Scan Radiology Hub కు సంబంధించి అవసరమైన స్థలాన్ని పరిశీలించాలని వారు వైద్యాధికారులకు సూచించారు. అదేవిధంగా ఎ-ఎబిఎ కు



సంబంధించిన నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పనులు వేగవంతం చేసి త్వరిత గతిన పూర్తి చేయాలని అన్నా రు. ఏరియా ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ సిబ్బంది సమన్వ యంతో ఉండే నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. సైదులు, ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రాజశేఖర్ రెడ్డి, ఈ ఈ ట్రైబల్ వెల్ఫేర్ మధుకర్, వైద్యులు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఘనంగా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుమార్తె నిశ్చితార్థ వేడుక

హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రులు.



హైదరాబాద్ నవంబర్ 6 నిర్భయవార్త రిపోర్టర్. వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె డాక్టర్ గాయత్రి నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అదేవిధంగా ఎంపీలు రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్‌తో పాటు పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, రాజకీయ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఆనందాలతో నిండాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాష్ట్రస్థాయి రాజకీయ ప్రముఖుల సందడి మధ్య నిశ్చితార్థ వేడుక అంగరంగ వైభవంగా సాగింది. ఈ వేడుకతో జూబ్లీ కన్వెన్షన్ సెంటర్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

వ్యవసాయ డ్రోన్ శిక్షణ -- వై టి సి భద్రాచలంలో ప్రారంభం ఐటీడీఏ పీవో బి రాహుల్



భద్రాచలం అక్టోబర్ 6 నిర్భయ వార్త ప్రతినిధి. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడంలో భాగంగా యూత్ ట్రైనింగ్ సెంటర్ (వై), భద్రాచలం నందు వ్యవసాయ డ్రోన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతోందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో డ్రోన్ల ఉపయోగాలు పంటలకు పురుగుమందులు, ఎరువులను వేగంగా పిచికారీ చేయవచ్చు. నీరు మందుల వినియోగాన్ని తగ్గించవచ్చు. తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయవచ్చు. రైతుల శ్రమ, సమయం ఖర్చును తగ్గించడంలో సహాయపడుతుంది పురుగుమందుల ప్రత్యక్ష సంబంధాన్ని తగ్గించి రైతుల ఆరోగ్య భద్రతకు తోడ్పడుతుంది. ఆధునిక డ్రోన్ టెక్నాలజీ ద్వారా వ్యవసాయాన్ని మరింత సులభతరం చేయవచ్చు. యువతకు ఒక మంచి అవకాశం డ్రోన్ టెక్నాలజీపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొనడానికి తమ పేర్లను నమోదు చేసుకోండి.

రిజిస్ట్రేషన్ స్థలం: యూత్ ట్రైనింగ్ సెంటర్ , భద్రాచలం. మరిన్ని వివరాలకు సంప్రదించండి: 9441390232 ఆధునిక సాంకేతికతను నేర్చుకోండి -- వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేసుకోండి!

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం సమర్పించిన ప్రెస్ క్లబ్ ప్రతినిధులు



కాప్రా, నవంబర్ 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి మేడ్చల్ జిల్లా కాప్రా పరిధిలో విధులు నిర్వహిస్తున్న అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కాప్రా ప్రెస్ క్లబ్ ప్రతినిధులు రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కోరారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చర్లపల్లిలోని ప్రొఫెసర్ జయశంకర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన మంత్రి శ్రీధర్‌బాబుకు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో ప్రెస్ క్లబ్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో నాలుగో స్తంభంగా నిలుస్తున్న జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో నిరంతరం కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. సమాజం పట్ల బాధ్యతతో విధులు నిర్వహిస్తున్నప్పటికీ, చాలామంది జర్నలిస్టులకు సొంత ఇళ్లు లేకపోవడంతో పరిమిత ఆదాయంతో అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. జర్నలిస్టుల సేవలను గుర్తించి, వారి చిరకాల స్వప్నమైన సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. కాప్రా ప్రాంత జర్నలిస్టుల సుదీర్ఘకాల నిరీక్షణకు తెరదించుతూ అర్హులైన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మెరుగు చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి ముత్యం ముఖేష్ గౌడ్, కోశాధికారి వెంకట యోగి రామచంద్ర మూర్తి, ముఖ్య సలహాదారులు బేలిదే అశోక్ గుప్తా, సీనియర్ జర్నలిస్టు పలుగుల పవన్, క్లబ్ ఉపాధ్యక్షులు యావాపురం రవి, వెంకట్, శనిగరం అశోక్, గాదె రాము, రమేష్, అమరేందర్, భవాని శంకర్, చుక్కా రమేష్, నిరంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చ బొల్లారంలో ఎన్‌హెచ్‌ఆర్‌సీ సభ్యురాలి క్షేత్రస్థాయి పరిశీలన

ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపునకు కలెక్టర్ గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాల పరిశీలన.. ప్రజారోగ్యం, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి





మేడ్చల్ మల్కాజిగిరి, నవంబర్ 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి మేడ్చల్ జిల్లా మచ్చ బొల్లారంలోని హిందూ శ్మశానవాటిక ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణపై వ్యక్తమవుతున్న ఆందోళనల నేపథ్యంలో, అక్కడ కొనసాగుతున్న వ్యర్థాల ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను మరో ప్రాంతానికి తరలించే ప్రతిపాదనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) సభ్యురాలు విజయ భారతి సయాని క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఐఏఎస్ గుర్తించిన నాలుగు ప్రత్యామ్నాయ స్థలాలను ఆమె సందర్శించి వాటి అనుకూలతను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, ట్రాన్స్‌ఫర్ స్టేషన్ ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, ప్రజారోగ్యం, పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను సమీక్షించారు. జిల్లా కలెక్టర్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వినయ్ కృష్ణారెడ్డి, ఐఏఎస్‌లు ప్రస్తుత ట్రాన్స్‌ఫర్ స్టేషన్ పరిస్థితులతో పాటు గుర్తించిన ప్రత్యామ్నాయ స్థలాల వివరాలను ఆమెకు వివరించారు. హిందూ శ్మశానవాటిక ప్రాంతంలో వ్యర్థాల నిర్వహణపై స్థానికంగా వ్యక్తమవుతున్న ఆందోళనలు, ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని ట్రాన్స్‌ఫర్ స్టేషన్ తరలింపునకు అనువైన స్థలాన్ని ఎంపిక చేసే అంశంపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ప్రజారోగ్యం, పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ తగిన నిర్ణయం తీసుకునే దిశగా ఈ పరిశీలన కొనసాగింది. ఈ పర్యటనలో మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్, అదనపు కమిషనర్ (హెల్త్ అండ్ శానిటేషన్) సి.ఎన్. రఘు ప్రసాద్, ఆర్డీఓలు వెంకట్ రెడ్డి, శ్యాంప్రకాష్, తహసీల్దార్లు రాములు, మతిన్‌తో పాటు పలువురు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చింతల్ సర్కిల్ నూతన ఉప కమిషనర్‌గా లక్ష్మీప్రసన్న బాధ్యతల స్వీకరణ

వన్ డే.. వన్ వార్డ్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతుల స్వీకరణ..



చింతల్, నవంబర్ 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి చింతల్ సర్కిల్ నూతన ఉప కమిషనర్‌గా లక్ష్మీప్రసన్న బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఉప కమిషనర్‌గా విధులు నిర్వహించిన స్పందన దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆమె బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా శుక్రవారం చింతల్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ హాల్‌లో చింతల్ డివిజన్ ప్రజలు, స్థానిక నాయకులు, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ.. వన్ డే.. వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నామని తెలిపారు. సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల ప్రారంభానికి సంబంధించి ప్రతిపాదనలు పంపించామని, అనుమతులు మంజూరైన వెంటనే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చింతల్ డివిజన్ నాయకులు బాల్ రెడ్డి, రాధాకృష్ణ రెడ్డి, నరసింహ గౌడ్, సూర్య ప్రకాష్, డేగ రెడ్డి, నరేందర్ గౌడ్, ప్రతాప్ రెడ్డి, కొమురయ్య, శ్రీరామ్ మూర్తి, రమణ, లక్ష్మణరావు, మధు, సురేష్‌తో పాటు వివిధ వెల్ఫేర్ అసోసియేషన్ల కమిటీ సభ్యులు, డివిజన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అబద్ధపు ఆరోపణలు మాని.. కూకట్‌పల్లి అభివృద్ధికి సహకరించండి!

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సూటి ప్రశ్నలు..
ప్రజా కార్యక్రమాలకు మద్దతు తెలపాలని హితవు



కూకట్‌పల్లి నవంబర్ 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధిపై విమర్శలు చేసే ముందు గత పదేళ్లలో అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన పనులపై ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమాధానం చెప్పాలని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై ఆరోపణలు చేయడం మానుకుని నిర్మాణాత్మకంగా సహకరించాలని సూచించారు. కూకట్‌పల్లి మెట్రో పార్కులో స్టేడియం నిర్మాణ ప్రతిపాదన గత పదేళ్లలో ఎందుకు కార్యరూపం దాల్చలేదని, కేపీహెచ్‌బీ--జేఎన్‌టీయూ రోడ్డులో పెట్రోల్ బంక్ ఏర్పాటు అంశంపై గతంలో తీసుకున్న నిర్ణయాలేమిటని ప్రశ్నించారు. అలాగే రమ్య గ్రౌండ్ సమీపంలో స్వర్గీయ ఎన్టీఆర్ పేరుతో పాఠశాల నిర్మిస్తామని చెప్పి మీ పార్టీకి చెందిన కార్పొరేటర్ నిధులు వసూలు చేశారనే ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలని, పాఠశాల నిర్మాణం ఎందుకు చేపట్టలేదో వివరించాలని కోరారు. హైదరాబాద్‌లో అద్దె ఇళ్ల భారంతో ఇబ్బందులు పడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేసేలా తెలంగాణ హౌసింగ్ బోర్డు ద్వారా ఎల్ఐజీ, ఎంఐజీ ఇళ్ల నిర్మాణ ప్రతిపాదనను స్వాగతించాలని సూచించారు. దాదాపు రూ.40 లక్షల విలువైన ఇంటిని రూ.6 లక్షలకే అందించే ప్రతిపాదన, లక్ష మంది గృహ అవసరాలను తీర్చాలనే లక్ష్యం అమలైతే ఎంతోమందికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. వరుసగా మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన మాధవరం కృష్ణారావు తన రాజకీయ అనుభవాన్ని నియోజకవర్గ అభివృద్ధికి వినియోగించాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రజాప్రయోజన కార్యక్రమాలకు మద్దతు తెలపాలని శేరి సతీష్ రెడ్డి కోరారు. రాజకీయ విమర్శల కంటే ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే ముఖ్యమని గుర్తించి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా ఇటుక బట్టీల దందా!

- ఉన్నది నాలుగు బట్టీలు.. అనుమతులు మాత్రం శూన్యమంటూ ఆరోపణలు.
- నిబంధనలు గాలికి.. అధికారుల పర్యవేక్షణ ఏదీ?



పినపాక, నవంబర్ 6 నిర్భయ వార్త ప్రతినిధి. మండలంలోని ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా ఇటుక బట్టీల వ్యాపారం విచ్చలవిడిగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా నాలుగు ఇటుక బట్టీలు కొనసాగుతుండగా, వీటిలో ఒక్కదానికి కూడా సంబంధిత శాఖల అనుమతులు లేవని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు సాగుతున్నా అధికారుల నుంచి కనీస పర్యవేక్షణ లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాలుగు బట్టీలు.. ఒకే గుప్పెట్లో!

మండలంలోని నాలుగు ఇటుక బట్టీల వ్యాపారం ఒకే సామాజిక వర్గానికి చెందిన కొందరి ఆధీనంలో కొనసాగుతోందనే ఆరోపణలు ఉన్నాయి. భారీ స్థాయిలో ఇటుకల తయారీ, విక్రయాలు సాగుతున్నా అనుమతులు, పర్యావరణ నిబంధనలు, మట్టి తవ్వకాలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుములపై అధికారిక వివరాలు బయటకు రావడం లేదు.

మామూళ్ల మత్తులో అధికారులా?

నెలవారీ మామూళ్ల వ్యవహారం కారణంగానే ఇటుక బట్టీలపై అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. రాజకీయ పలుకుబడి, మీడియా పేర్లను అడ్డుపెట్టుకుని వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారనే విమర్శలూ ఉన్నాయి. ఈ ఆరోపణలపై ఉన్నతాధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సంబంధిత శాఖలు ఏం చేస్తున్నట్లు?

ఐదు ఇటుక బట్టీలకు సంబంధించిన అనుమతులపై రెవెన్యూ, మైనింగ్, కాలుష్య నియంత్రణ శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలి. మట్టి తవ్వకాల నుంచి ఇటుకల తయారీ, విక్రయాల వరకు ప్రతి అంశాన్ని పరిశీలించాలి. అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఏడూళ్ల బయ్యారం కేంద్రంగా సాగుతున్న ఇటుక బట్టీల వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ఎప్పుడు స్పందిస్తారు? క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తెస్తారా? అన్నది వేచి చూడాలి.

కర్రెగుట్టల్లో భారీగా బీజీయల్స్ స్వాధీనం







చర్ల నవంబర్ 06 నిర్భయ వార్త ప్రతినిధి. చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లా కర్రె గుట్ల కొండల్లో భద్రత బలగాలు నక్సల్స్ భారీ డంపును గుర్తించాయి. ఈ డంపులో దాచిపెట్టిన 711 బిజిఎల్ (బ్యారెల్ గ్రేనేడ్ లాంచర్) సెల్స్ ను శుక్రవారం బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఇక్కడి కొండల్లో శుక్రవారం తడపల ఎఫ్ఓబి(ఫార్వర్డ్ ఆపరేటింగ్ బేస్) నుంచి బయలుదేరు వెళ్లిన బలగాలు వీటిని గుర్తించాయి.ఒకప్పుడు తమకు అత్యంత సురక్షితమైన ఆశ్రయంగా మావోయిస్టు లు భావించిన ఈ ప్రాంతంలో నక్సల్స్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు ఉండేవి. వారు ఈ పేలుడు పదార్థాలను ఇక్కడ తయారు చేసి భద్రతా బలగాలపై దాడి చేయడానికి బస్తర్‌లోని వివిధ ప్రాంతాలకు పంపే వారు.మావోయిస్టులు ఈ కొండలలో ఒక శిబిరాన్ని, ఆయుధాల తయారీ కర్మాగారాన్ని స్థాపించారు. అక్కడి నుండి వారు భద్రతా దళాలను లక్ష్యంగా చేసుకోవడానికి సిద్ధమయ్యారు. 2025లో భద్రతా దళాలు అక్కడికి చేరుకున్నప్పుడు, వారు నక్సల్స్ ఆయుధాల తయారీ కర్మాగారాన్ని ధ్వంసం చేశారు.ఇక్కడి శత్రుదుర్భేద్యమైన కొండలలో భద్రతా దళాలు చేపట్టిన భారీ ఆపరేషన్ అనంతరం, ఆ ప్రాంతంలోని నక్సలైట్ నెట్‌వర్క్‌ను నిర్మూలించారు. బస్తర్‌ను కూడా మావోయిస్టుల చెర నుండి విడిపించారు. సైనికులు అక్కడ తమ బేస్ క్యాంప్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం భద్రతా బలగాలు క్యాంపెయిన్ 2.0ను నడుపుతున్నారు. ఈ నేపథ్యంలో భద్రతా బలగాలు మాజీ నక్సల్స్ స్థావరాలలో దాచిపెట్టిన ఆయుధాలు, పేలుడు పదార్థాలు మరియు ఐఈడీల కోసం ఆపరేషన్ 2.0ను నిర్వహిస్తున్నారు. ఆ ప్రాంతంలో ఐఈడీలు మరియు ఇతర పేలుడు పదార్థాలు ఇంకా దాచిపెట్టి ఉన్నాయని అనుమానిస్తున్నారు. సిఆర్‌పిఎఫ్ 196 బెటాలియన్, జిల్లా పోలీసులు, 2004 బెటాలియన్ కోబ్రా పోలీసులు సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి.

ప్రభుత్వ పథకాల అమలులో మరింత వేగం పెంచాలి

జిల్లా కలెక్టర్లకు సీఎస్ సంజయ్ జాజు ఆదేశాలు..

తాగునీటి ఎద్దడి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని సూచన



హైదరాబాద్, నవంబర్ 06: నిర్భయవార్త సిటి బ్యూరో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందించాలని, తద్వారా ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలని సూచించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన సీఎస్.. విద్య, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గృహ నిర్మాణం, భూసేకరణ తదితర శాఖల పనితీరును సమీక్షించారు. కలెక్టర్లు విద్యాసంస్థలు, ఆసుపత్రులు, గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఇటీవల తుఫాను సమయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ సమయస్ఫూర్తితో స్పందించి ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని రక్షించిన తీరును ప్రత్యేకంగా అభినందించారు. **తాగునీటి సమస్య రాకుండా చర్యలు** ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని 565 మండలాల్లో ఆవాసాల వారీగా నీటి పరిస్థితిని అంచనా వేయాలని సూచించారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిన నేపథ్యంలో సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్, నిజామాబాద్ జిల్లాల్లో తాగునీటి సరఫరా కోసం ప్రభుత్వం రూ.120 కోట్లు కేటాయించిందని తెలిపారు. జిల్లా స్థాయి కమిటీలు



క్రమం తప్పకుండా సమావేశమై నీటి సరఫరాను సమీక్షించాలని పేర్కొన్నారు. **ఉపాధి పనులు, వశుగ్రాసానికి ప్రాధాన్యత** రాష్ట్రంలో ఇప్పటివరకు 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించినట్లు గుర్తుచేశారు. వీబీ-జీ రామ్ జీ పథకం కింద ప్రస్తుతం రోజుకు 5.38 లక్షల పనిదినాలు కల్పిస్తున్నామని, 2027 మార్చి నాటికి 11 కోట్ల పనిదినాల లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి ఆవాసంలో ఉపాధి పనులు చేపట్టాలని, నీటిపారుదల, పంచాయతీరాజ్, మిషన్ భగీరథ, వ్యవసాయ, పశు సంవర్ధక శాఖల సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పశుగ్రాసం పెంపకానికి చర్యలు చేపట్టడంతో పాటు జలసిరి పథకం కింద ఫామ్ పాండ్లు, ఇంకుడు గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.

పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష

చేయూత పథకం కింద అందిన 5.9 లక్షల దరఖాస్తుల్లో 38 వేల మినహా మిగిలిన వాటి పరిశీలన పూర్తయిందని తెలిపారు. పెండింగ్ దరఖాస్తులను నవంబర్ రెండో వారంలోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెండు విడతల్లో మంజూరైన 3.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బస్తా సిమెంట్ రూ.230కే అందుబాటులో ఉందని, 'మన ఇసుక వాహనం' ద్వారా ఇసుక సరఫరా జరిగేలా చూడాలని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను అర్హులకు నిబంధనల ప్రకారం కేటాయించాలని పేర్కొన్నారు. అలాగే వివిధ అభివృద్ధి ప్రాజెక్టులు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, రవాణా శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి. గౌతమ్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడికి పరామర్శ

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన కాంగ్రెస్ నాయకులు

కారేపల్లి నవంబర్ 6 నిర్భయవార్త రిపోర్టర్. సింగరేణి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు తలారి చంద్రప్రకాష్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒమేగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న సింగరేణి మండల మాజీ రైతుబంధు కన్వీనర్ గుగులోతు శ్రీను నాయక్, మాజీ దుబ్బతండ ఎంపీటీసీ దారావత్ పాండ్యా నాయకులు ఆసుపత్రికి వెళ్లి చంద్రప్రకాష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. చంద్రప్రకాష్ త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని వారు ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో శ్రీనన్న ముఖ్య అనుచరులు కట్ల శ్రీనివాసరావు, పాత కమలాపురం గ్రామపంచాయతీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూరి తిరుపతయ్య, గ్రామ పెద్దలు కాటిన్ని రామారావు తదితరులు పాల్గొన్నారు.



కార్తీక మాసంలో పుణ్యక్షేత్రాలకు టీజీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భక్తుల కోసం ప్రత్యేక యాత్రా సౌకర్యాలు



కుషాయిగూడ నవంబర్ 06 నిర్భయవార్త జిల్లా ప్రతినిధి: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రాలతో పాటు వివిధ పుణ్యక్షేత్రాలకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎన్ఆర్టీసీ) కుషాయిగూడ డిపో ఆధ్వర్యంలో ప్రత్యేక యాత్రా బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ ఒక ప్రకటనలో వెల్లడించారు. ప్రతి శని, ఆదివారాల్లో భక్తుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే షిరిడి, గానుగాపూర్, పండరీపూర్, రామేశ్వరం, కాశీ, గోవా, పూరి తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలకు ప్రతి నెలా ప్రత్యేక బస్సు యాత్రలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కనీసం 30 మంది ప్రయాణికులు ఉంటే, వారు కోరుకున్న ప్రాంతం నుంచి కోరుకున్న గమ్యస్థానానికి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. వివాహాలు, ఇతర శుభకార్యాల కోసం కూడా తక్కువ అద్దె ధరలకే నూతన బస్సులను అందుబాటులో ఉంచినట్లు వివరించారు. అదేవిధంగా అయ్యప్పమాలధారుల శబరిమల యాత్ర కోసం ప్రత్యేకమైన, సౌకర్యవంతమైన బస్సులను తక్కువ ధరలకే అద్దెకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ బస్సుల్లో గురుస్వామికి ఒక సీటు ఉచితంగా కేటాయించడంతో పాటు ఇద్దరు వంటవారు, ఇద్దరు కన్నెస్వాములు, ఒక అటెండర్‌కు సీట్లు లేకుండానే ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. అంతేకాకుండా కేరళ రాష్ట్ర సరిహద్దు పన్ను (బోర్డర్ ట్యాక్స్) నుంచి మినహాయింపు కూడా కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. టీజీఎస్ఆర్టీసీ కుషాయిగూడ డిపో అందిస్తున్న ఈ ప్రత్యేక బస్సు సౌకర్యాలను భక్తులు, ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ వి. వేణుగోపాల్ కోరారు. మరిన్ని వివరాలు, బస్సుల బుకింగ్ కోసం 9603549388, 9493210071, 9959226145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి టపాసులపై టాస్క్‌ఫోర్స్ దాడులు..

రూ.లక్ష డెబై ఐదు వేల విలువైన టపాసులు స్వాధీనం.




ఖమ్మం నవంబర్ 6 నిర్భయ వార్త రిపోర్టర్. దీపావళి పండుగ నేపథ్యంలో నిబంధనలకు విరుద్ధంగా టపాసులు నిల్వ ఉంచి విక్రయించే వారిపై ఖమ్మం పోలీస్ కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని బుర్హన్ పూరం లోని నాగ వెంకటసాయి కిరాణా దుకాణంలో అక్రమంగా నిల్వ ఉంచిన టపాసులపై టాస్క్‌ఫోర్స్ సిఐ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి సుమారు 1,75,000/- వేల రూపాయల విలువైన టపాసులను స్వాధీనం చేసుకొని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం టూ టౌన్ పోలీస్ స్టేషన్ కు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులను నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పండుగను ప్రజలందరూ సురక్షితంగా జరుపుకోవాలని, అనుమతులు

కలిగిన విక్రయ కేంద్రాల నుంచే టపాసులు కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ టపాసుల నిల్వలు, విక్రయాలపై సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ జిల్లా నాయకులు

తిరుపతిరావు, బిల్ కంపెనీ మేనేజర్ గుగులోతు రవి నాయక్



కారేపల్లి నవంబర్ 6 నిర్భయవార్త రిపోర్టర్. వైరా శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ పెద్ద కుమార్తె డాక్టర్ గాయత్రి నిశ్చితార్థ వేడుక హైదరాబాద్‌లోని జూబ్లీ కన్వెన్షన్ హాల్‌లో అత్యంత వైభవంగా, అంగరంగ వైభవంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, రాజకీయ ప్రముఖులు, వివిధ రంగాలకు చెందిన ఆహ్వానితుల సమక్షంలో ఈ వేడుక సందడిగా సాగింది. ఈ శుభకార్యానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు తిరుపతిరావు, బెల్ కంపెనీ మేనేజర్ గుగులోతు రవి నాయక్ ప్రత్యేకంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆత్మీయంగా ఆశీర్వదించి, వారి భవిష్యత్తు జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఆనందంగా సాగాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నిశ్చితార్థ వేడుకలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనగా, అతిథుల రాకతో జూబ్లీ కన్వెన్షన్ హాల్ సందడిగా మారింది. ఈ వేడుక కుటుంబ సభ్యులకు, ఆత్మీయులకు మధురమైన జ్ఞాపకంగా నిలిచింది.

నదుల్లో నీళ్లున్నా పొలాలకు ఇవ్వలేని దౌర్భాగ్యం.. ఇది రేవంత్ వృష్టి : హరీష్ రావు

(మొదటిపేజీ తరువాయి)

ఇవాళ పంటల బీమా ఉండి ఉంటే రైతులకు కొంతైనా నష్టపరిహారం అందేదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రల్లో తక్షణ కరువు సాయం కింద ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతులకు అందిస్తున్నారని ఉదహరించారు.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 25 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు అల్లాడుతుంటే, కనీసం క్యాబినెట్ భేటీలో కూడా దీనిపై చర్చించకపోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే నేడు తెలంగాణ వ్యాప్తంగా పంటలు ఎండిపోయి కరువు పరిస్థితులు దాపురించాయని స్పష్టం చేశారు.

వంద దేశాల నుంచి ప్రతినిధులు రాక

(మొదటిపేజీ తరువాయి)

ప్రతినిధులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. ఈ అంతర్జాతీయ సదస్సు కోసం దాదాపు 450 మంది విశిష్ట అతిథులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమ ఏర్పాట్లను పూర్తి చేస్తున్నారు. ఈ సదస్సుకు కేంద్ర మంత్రులతో పాటు కాంగ్రెస్ జాతీయ నాయకుడు, పార్లమెంట్ సభ్యుడు శశి థరూర్ తదితర రాజకీయ, దౌత్య రంగాల ప్రముఖులు హాజరుకానున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ సమ్మిట్లో అంతర్జాతీయ సంబంధాలు, ఆర్థిక పురోగతి, గ్లోబల్ పార్టనర్షిప్లపై కీలక చర్చలు జరగనున్నాయి.

తెలంగాణలో ఇంటింటికీ ఇంటర్నెట్

(మొదటిపేజీ తరువాయి)

రూరల్ ఇంటర్నెట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్’ను ఏర్పాటు చేయనున్నారు. టీ-ఫైబర్ ఎండీ పన్నీరు వేణు ప్రసాద్ ఈ కొత్త కార్పొరేషన్‌కు సీఈఓగా వ్యవహరించనున్నారు. టీ-ఫైబర్, కొత్త కార్పొరేషన్ సంయుక్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ ఇంటర్నెట్ సౌకర్యాన్ని కల్పించనున్నాయి. ఈ సమావేశానికి వర్చువల్ విధానంలో సీనియర్ ఐఏఎస్ అధికారులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, డాక్టర్ గౌరవ్ ఉప్పల్ హాజరయ్యారు. సంచార్ భవన్‌లో జరిగిన నేరుగా జరిగిన కార్యక్రమంలో డిజిటల్ భారత్ నిధి అడ్మినిస్ట్రేటర్ శ్యామల్ మిశ్రా, తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, టీ ఫైబర్ ఎండీ ఉ సీఈఓ పన్నీరు వేణు ప్రసాద్, బీఎస్ఎన్ఎల్ఎ డైరెక్టర్ పాపా సుధాకర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విమర్శలకు రాజకీయంగానే సమాధానం చెప్పాలి..

(మొదటిపేజీ తరువాయి)

పోలీసు కేసులతో కాదని సూచించారు. అరెస్టు పేరుతో బాలరాజు యాదవ్‌ను సిటీ అంతా తిప్పుతూ ఆయన కుటుంబాన్ని భయభ్రాంతులకు గురిచేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. అక్రమ కేసులతో బీఆర్ఎస్ గొంతుకలను అణచివేయలేరని.. బాలరాజు యాదవ్‌పై కేసును తక్షణమే ఉపసంహరించుకుని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నించే హక్కును కాలరాయలేరు..

దూదిమెట్ల బాలరాజ్ యాదవ్‌ను బేషరతుగా విడుదల చేయాలని మాజీమంత్రి, బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతలు నిరాధారమైన వ్యక్తిగత ఆరోపణలు చేస్తే ప్రశ్నించిన దూదిమెట్ల అరెస్ట్ చేయడం అక్రమమని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య బద్ధంగా విమర్శలు, ప్రతి విమర్శలు సహజమని ఆయన పేర్కొన్నారు. బడుగు బలహీన వర్గాలకు చెందిన నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తుందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో తప్పుడు ఆరోపణలను ప్రశ్నించడం, ఖండించడం నేరమా? అని ప్రశ్నించారు.

గౌరవెల్లి ప్రాజెక్టుతో హుస్నాబాద్ రూపురేఖలు మారుస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తున్నట్లు వెల్లడించారు. గౌరవెల్లి, గండిపల్లి ప్రాజెక్టులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని, గండిపల్లి ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలకు నీరందిస్తామని పేర్కొన్నారు.

అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. గత ఏడాది నియోజకవర్గానికి 3,500 ఇళ్లు మంజూరు చేయగా, ప్రస్తుతం మరో 2 వేల ఇళ్లను కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. నవంబర్ 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీతో పాటు రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా పథకాన్ని ప్రారంభిస్తామని ప్రకటించారు.

రైతులకు మద్దతు ధర.. మెగా జాబ్‌మేళా

నియోజకవర్గంలో మొత్తం 136 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర అందిస్తామని మంత్రి చెప్పారు. జనవరిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ తర్వాత రైతు మేళా ఏర్పాటు చేస్తామన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందిస్తున్నట్లు వెల్లడించారు.

విద్య, వైద్యం, రహదారుల అభివృద్ధికి చర్యలు

హుస్నాబాద్‌లో 250 పడకల ఆసుపత్రి, ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని మంత్రి తెలిపారు. నాలుగు లైన్ల రహదారుల నిర్మాణం, ఆలయాల అభివృద్ధి, అర్బన్ ఫారెస్ట్ పార్కు, కోహెడ చెరువు అభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలో క్రీడా మైదానాల ఏర్పాటుకు రూ.లక్ష చొప్పున నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. సాగునీరు, విద్య, వైద్యం, రహదారులు, సంక్షేమ రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించి హుస్నాబాద్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు.

తెలంగాణలో నీళ్లే కాదు ఇక పాలకూ కష్టమే..

(మొదటిపేజీ తరువాయి)

నానాటికి తగ్గుముఖం పడుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం ఆవులు 30,69,524, గేదెలు 30,52,102, మేకలు 45,48,999 మాత్రమే ఉన్నాయి. వీటి ద్వారా రోజుకు కేవలం మూడు లక్షల లీటర్ల పాల ఉత్పత్తి మాత్రమే జరుగుతుంది. రాష్ట్ర అవసరాలకు 30 లక్షల లీటర్ల పాలు అవసరం కాగా, మిగతా 27 లక్షల లీటర్లను ప్రతి రోజు తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల డెయిరీల నుంచి దిగుమతి చేసుకుంటున్నాం.

భగ్గుమంటున్న పశు గ్రాసం ధరలు

ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ వరకు ఆశించిన వర్షాలు లేవు. ఈ కారణంగా రాష్ట్రంలో 18 శాతం వరి సాగు తగ్గింది. దీనికితోడు గడ్డి, జొన్న సాగుకూ నీటి కొరత ఏర్పడింది. దీంతో పచ్చి, ఎండిగడ్డి కొరత ఏర్పడి పశువులకు మేత లేకుండాపోయింది. వరి సాగైన ప్రాంతాల్లో ఎండుగడ్డి ధరలు అమాంతం పెరిగిపోయాయి. గతంలో ఎండుగడ్డి కట్ట ధర రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.150కి చేరింది. ఇలా ట్రాక్టర్ గడ్డి ధర ఒకేసారి రూ.5 వేలు పెరిగి రైతులకు షాక్ ఇస్తున్నాయి. వీటికితోడు దాణా ధరలు ఆకాశాన్నంటున్నాయి. తవుడు, మొక్కజొన్న పొడి, కంది, పెనలు, బొబ్బర్లు, మినుము, గోధుమల పొట్టు, జొన్న సొప్ప, పత్తిచెక్క, వేరు శనగ దాణా.. గతంలో కిలో రూ.20 ఉండగా, ఇప్పుడు రూ.60కి చేరింది. పత్తి చెక్కల మిశ్రమమైన పత్తికల్లు ధర 6 నెలల క్రితం రూ.1,400 ఉండగా ఇప్పుడు రూ.2000 లకు చేరింది. ఇలా రేట్లు పెరగడంతో పాల ఉత్పత్తి భారీగా పడిపోయింది. మరోవైపు నీటి ఎద్దడి కారణంగా పశుగ్రాసం కొరత ఏర్పడి రైతులకు పశుపోషణ కష్టంగా మారింది ఈ నేపథ్యంలో పశువులను సాదలేక రైతులు అమ్ముకుంటున్నారు. రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సమాఖ్య చొరవ తీసుకుని 100 శాతం సబ్సిడీతో దాణాను పంపిణీ చేస్తేనే కాస్తోకూస్తో పాల ఉత్పత్తిని కాపాడుకునే వాళ్లం అవుతామని పాడి రైతులు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి సీతక్క గుడ్‌న్యూస్..

(మొదటిపేజీ తరువాయి)

ఉండగా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.230 నుంచి రూ.250కే సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన లబ్ధిదారులు వినియోగించుకోవాలని సూచించారు. ఇందుకోసం అధికారులు ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ నెల 8 నుంచి 4.5 లక్షల మందికి కొత్త పింఛన్లు

కొత్త పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న వారికి మంత్రి కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 8వ తేదీ నుంచి సుమారు 4.5 లక్షల మందికి కొత్త పింఛన్ల పంపిణీ ప్రారంభం కానుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు. అదేవిధంగా వెంకటాపూర్ మండలంలో అర్హులైన 11,863 మందికి ఆధునిక స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆదర్శ గ్రామంగా మారితే రూ.కోటి నజరానా

గ్రామాల సమగ్ర అభివృద్ధికి స్థానిక ప్రజాప్రతినిధులు ప్రాధాన్యత ఇవ్వాలని సీతక్క సూచించారు. గ్రామ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులకు తీర్మానాలు చేస్తే నిధుల కొరత లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. నారాయణగిరిపల్లె పంచాయతీకి ఇప్పటికే రూ.కోటిన్నర నిధులు కేటాయించినట్లు తెలిపారు. గ్రామంలో శుభకార్యాల నిర్వహణ కోసం రూ.15 లక్షలతో ఫంక్షన్ హాల్ నిర్మిస్తామని ప్రకటించారు. నర్పంచులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దితే ప్రభుత్వం నుంచి రూ.కోటి ప్రత్యేక నిధులు పొందవచ్చని వెల్లడించారు.

రూ.3 కోట్లకు పైగా అభివృద్ధి పనులు ప్రారంభం

వెంకటాపూర్ మండల పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. నారాయణగిరిపల్లెలో రూ.20 లక్షల ఎన్‌టీఎన్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి లెనిన్ వత్సల్ టోప్పోతో కలిసి ప్రారంభించారు. రామాంజపురంలో రూ.1.35 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైనేజీ వసులను ప్రారంభించారు. అలాగే రూ.1.50 కోట్ల వ్యయంతో ఆర్ అండ్ బీ రోడ్డు నుంచి వినాయక రైస్ మిల్ వరకు నిర్మించిన రహదారిని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమాల్లో ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, తహసీల్దార్ గిరిబాబు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నగరవాసులకు సర్కార్ దీపావళి గిఫ్ట్

మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి పాస్ ధరలు భారీగా తగ్గింపు



నిర్భయవార్త ప్రతినిధి :

హైదరాబాద్ :

రాష్ట్ర ప్రజలకు దీపావళి కానుకగా మెట్రో-ఆర్టీసీ ఉమ్మడి ప్రయాణ పాస్ ధరలను భారీగా తగ్గిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రయాణికులపై ఆర్థిక భారాన్ని తగ్గించి, ప్రజా రవాణాను మరింత ప్రోత్సహించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు.

భారీగా తగ్గిన పాస్ ధరలు ఇలా..

ప్రస్తుతం రూ.8,500గా ఉన్న నెలవారీ ఉమ్మడి పాస్ ధరను ఏకంగా రూ.4 వేలకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఈ రూ.4 వేలలో రూ.3 వేలు మెట్రో ప్రయాణానికి, రూ.వెయ్యి ఆర్టీసీకి కేటాయించారు. ఈ పాస్ ద్వారా నెలలో గరిష్టంగా 50 రౌండ్ ట్రిప్పులు ప్రయాణించవచ్చు. దీందతో ప్రయాణికులకు నెలకు రూ.4,500 ఆదా కానుంది. ప్రస్తుతం రూ.400గా ఉన్న రోజువారీ పాస్ ధరను రూ.275కు తగ్గించారు. ఇందులో రూ.200 మెట్రోకు, రూ.75 ఆర్టీసీకి చెందుతాయి. ఈ పాస్ ద్వారా రోజుకు 4 సింగిల్ జర్నీలు చేసే అవకాశం ఉంటుంది. దీని ద్వారా ప్రయాణికులకు ప్రతిరోజు రూ.125 ఆదా అవుతుంది.

నవంబర్ 8 నుంచి అమలు..

ఈ సవరించిన కొత్త ధరలు నవంబర్ 8 నుంచి అందుబాటులోకి వస్తాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజల సంక్షేమం, ప్రయాణికుల ఆర్థిక లబ్ధికి పెద్దపీట వేస్తూ తీసుకున్న ఈ నిర్ణయానికి సంబంధించి తగిన ఏర్పాట్లు చేయాలని మెట్రో, ఆర్టీసీ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ఈ నిర్ణయం హైదరాబాద్ నగరంలో రోజూ ప్రయాణించే ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్య ప్రజలకు ఎంతో ఉపయోగపడనుంది.

ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని ఎరుకల వారికే కేటాయించాలి

ప్రకటించకుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు ముట్టడిస్తాం: గిరిజన సంఘాల హెచ్చరిక తక్షణమే ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నిర్భయవార్త ప్రతినిధి : మన్సూరాబాద్:

రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న ఎస్టీ కమిషన్ చైర్మన్ పదవిని ఎరుకల సామాజిక వర్గానికి కేటాయించాలని, అలాగే ఎన్నికల మేనిఫెస్టో (చేవెళ్ల డిక్లరేషన్) ప్రకారం తక్షణమే ‘ఏకలవ్య కార్పొరేషన్’ను ఏర్పాటు చేసి చైర్మన్‌ను ప్రకటించాలని ఆదివాసీ గిరిజన, ఎరుకల సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ ఏకలవ్య నగర్‌లో నిర్వహించిన ముఖ్య సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జాతీయ కులవృత్తుల సంఘం జాతీయ అధ్యక్షుడు కండెల వెంకటేశ్వర్లు, తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కోనేటి నరసింహ మాట్లాడారు. రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రత్యేకంగా ఎస్టీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని తీర్మానించడంపై సీఎం రేవంత్ రెడ్డికి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో గతంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల డిక్లరేష న్‌లో ఇచ్చిన హామీ మేరకు ఎరుకల జాతి సంక్షేమం కోసం వెంటనే ఏకలవ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆదివాసీ గిరిజన సంఘాలను కలుపుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజ కవర్గ అధ్యక్షుడు ఉంద్రాతి రవి, సెక్రటరీ వనం గంగయ్య, యూత్ అధ్యక్షుడు దాసరి గంగాధర్, జగన్నాథం శ్రీను, శ్రీరామ్ మారయ్య, జగన్నాథం సమ్మయ్య, కుంభ వారన్నతో పాటు మహిళా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పోలీసుల ఆరోగ్య భద్రతకు ఫిట్ కాప్ : డీజీపీ సి.వి. ఆనంద్

సిబ్బంది ఆరోగ్య పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ

సమస్యల ఆధారంగా ప్రత్యేక వైద్య సూచనలు, కౌన్సెలింగ్

రాష్ట్రవ్యాప్తంగా 90 వేలకు పైగా పోలీసు సిబ్బందికి ప్రయోజనం



నిర్భయవార్త ప్రతినిధి :హైదరాబాద్ :

నిరంతర విధులు, పని ఒత్తిడి కారణంగా పోలీసులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపే అవకాశం తక్కువగా ఉంటుందని, వారు ఆరోగ్యంగా ఉన్నప్పుడే సమాజానికి మరింత మెరుగైన సేవలు అందించగలరని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఫిట్ కాప్ విధానాన్ని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ మరియు ఇతర సంస్థల సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి చర్యలు చేపట్టారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఫౌండేషన్ సభ్యులు, ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ నూతన కార్యక్రమ వివరాలను వెల్లడించారు.పోలీస్ హెల్త్ మేనేజ్‌మెంట్ ప్రొఫైల్ సిస్టమ్‌గా రూపొందించిన ఈ ప్రత్యేక యాప్ ఆధారిత విధానాన్ని రాబోయే 30 నుంచి 45 రోజుల్లోగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయడానికి కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ యాప్‌లో ఎనిమిది ప్రధాన ఆరోగ్య అంశాలకు సంబంధించిన ప్రశ్నలతో పాటు వ్యక్తిగత ఆరోగ్య సమాచారాన్ని నమోదు చేసుకునే అవకాశం కల్పించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 90 వేలకు పైగా పోలీసు సిబ్బంది తమ సెల్‌ఫోన్ నంబరు ఆధారంగా ఇందులో వివరాలు నమోదు చేసుకోవచ్చు. మధుమేహం, రక్తపోటు, బీఎమ్ఐ, జీవనశైలి అలవాట్లు, ధూమపానం, మద్యపానం వంటి అంశాల ఆధారంగా సిబ్బందిని తక్కువ, మధ్యస్థ, అధిక ఆరోగ్య ముప్పు విభాగాలుగా వర్గీకరిస్తారు. ఆరోగ్య ప్రమాద స్థాయిని బట్టి కాల్ సెంటర్ ద్వారా సంబంధిత సిబ్బందిని ఫోన్ ద్వారా అప్రమత్తం చేయడంతో పాటు వైద్య పరీక్షలు, ఆసుపత్రుల ద్వారా చికిత్స, కౌన్సెలింగ్ అందిస్తారని హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ఫౌండర్ సల్మాన్ వివరించారు. కిడ్నీ సమస్యలు, బీపీ, షుగర్ వంటి వ్యాధుల ముప్పును ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టడంలో ఈ విధానం కీలకంగా నిలుస్తుందని డీజీపీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో హైదరాబాద్ సీపీ సజ్జనార్, ఏడీజీ అకున్ సబర్వాల్, ఐజీ. గజరావు భూపాల్, ఆరోగ్య భద్రత కార్యదర్శి ఉదయ్ కుమార్ రెడ్డి, టీ స్పార్క్ ఎస్పీ రూపేష్, ఎస్పీ అవినాష్, హెల్పింగ్ హ్యాండ్ ఫౌండేషన్ ప్రతినిధులు మరియు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

యువత రాజకీయాల్లో క్రియాశీలకంగా రాణించాలి: మల్‌రెడ్డి రాంరెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి : చైతన్యపురి:

సేవాదళ్ యంగ్ బ్రిగేడ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన పి. గణేష్ రెడ్డి, రాష్ట్ర రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని చైతన్యపురిలోని కాంగ్రెస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి గణేష్ రెడ్డిని శాలువాతో సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ, ప్రజా సమస్యలపై అవగాహన పెంపొందించుకొని ప్రజాసేవలో ముందుండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ పార్టీని మరింత బలోపేతం చేయడంలో యువత కీలక పాత్ర పోషించాలని, నూతన నాయకత్వం యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన తాజా మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి

విఘ్నేశ్వర కాలనీ నుంచి పోచమ్మ దేవాలయం వరకు రూ. 27 లక్షలతో సీసీ రోడ్డు పనులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి

డివిజన్ అభివృద్ధికి నిరంతర కృషి: వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి



నిర్భయవార్త ప్రతినిధి : పెద్ద అంబర్‌పేట్:

పెద్ద అంబర్‌పేట్ 52వ డివిజన్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీ నుండి పోచమ్మ దేవాలయం వరకు రూ. 27 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం స్థానిక తాజా మాజీ కౌన్సిలర్ వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి పరిశీలించారు. ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన ఈ నిధులతో రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు వారు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను నమీక్షించారు. ఈ సందర్భంగాహౌహౌవడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజా సమస్యలను పరిష్కరించడమే తమ తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. ఎన్నో ఏళ్లుగా సరైన రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న కాలనీవాసుల బాధలను గుర్తించి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చొరవతో ఈ నిధులను మంజూరు చేయించినట్లు ఆమె వివరించారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆధ్వర్యంలో డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామని వారుహౌహౌవునరుద్ఘాటించారు. డివిజన్ అభివృద్ధికి, రవాణా సౌకర్యాల మెరుగుదలకు అహర్నిశలు శ్రమిస్తున్న వడ్డేపల్లి విద్యా విజేందర్ రెడ్డికి, నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కాలనీవాసులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విఘ్నేశ్వర కాలనీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, రఘుపతి, వడ్డేపల్లి ప్రతాప్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు నమ్మయ్యలతో పాటు వలువురు స్థానిక కాలనీవాసులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనుల నాణ్యతలో రాజీపడొద్దు..

అధికారులకు మంత్రి అడ్లూరి ఆదేశాలు



నిర్భయవార్త ప్రతినిధి : హైదరాబాద్ :

గోదావరి పుష్కరాల పనుల్లో జాప్యానికి తావు ఇవ్వవద్దని తెలంగాణ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా అన్ని అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆజ్ఞాపించారు. పుష్కరాలకు వచ్చే లక్షలాది భక్తులకు మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. ధర్మపురి, కోటిలింగాల అభివృద్ధి పనులపై మంత్రి శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి..

గోదావరి పుష్కరాల పనుల నాణ్యతలో రాజీపడొద్దని మంత్రి అడ్లూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని మార్గనిర్దేశం చేశారు. ఘాట్లు, రహదారులు, పార్కింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలను కల్పించాలని సూచించారు. మహిళలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని నిర్దేశించారు. గోదావరి పుష్కరాల కోసం రాష్ట్రవ్యాప్తంగా రూ.1,000 కోట్లను కేటాయించినట్లు ప్రకటించారు. ధర్మపురి అభివృద్ధికి సుమారు రూ.226 కోట్లతో ఆయా పనులకు ప్రణాళికలు చేస్తున్నామని తెలిపారు. ధర్మపురిలో 470 మీటర్ల మేర కొత్త స్నాన ఘాట్ల అభివృద్ధి ప్రతిపాదనలు చేస్తున్నామని వివరించారు. 2027 జూన్ 26వ తేదీ నుంచి జులై 7వ తేదీ వరకు గోదావరి పుష్కరాలు జరుగుతాయని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు.

దిల్‌సుఖ్‌నగర్‌లో వేగా జ్యువెలర్స్ నూతన షోరూమ్ ఘనంగా ప్రారంభం

షోరూమ్‌ను ప్రారంభించిన సినీ నటి ప్రగ్యా జైస్వాల్





నిర్భయవార్త ప్రతినిధి :దిల్‌సుఖ్‌నగర్:

ప్రముఖ ఆభరణాల సంస్థ 'వేగా జ్యువెలర్స్' తమ నూతన షోరూమ్‌ను హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్‌లో అత్యంత వైభవంగా ప్రారంభించింది. సంస్థ బ్రాండ్ ప్రచారకర్త నందమూరి బాలకృష్ణ శుభాశీస్సులతో, సినీ నటి ప్రగ్యా జైస్వాల్ ఈ షోరూమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె షోరూమ్‌ను సందర్శిస్తూ కొనుగోలుదారులతో సందడి చేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్ మల్‌రెడ్డి రామ్‌రెడ్డి హాజరయ్యారు. సంస్థ చైర్మన్ బండ్లమూడి రామ్మోహన్, మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ వనమా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సుధాకర్ వనమా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇది తమకు 7వ షోరూమ్ అని, హైదరాబాద్ నగరంలో రెండవదని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఖాతాదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను ప్రవేశపెట్టినట్లు చెప్పారు. బంగారు ఆభరణాలపై తరుగు (వేస్టేజ్) 2.99% నుండి 11.99% వరకు మాత్రమే ఉంటుందని, తయారీ (మేకింగ్) ఛార్జీలు ఉండవని వెల్లడించారు. అలాగే వజ్రాల ఆభరణాలపై క్యారెట్ ధర రూ. 47,999/- కే అందిస్తున్నామని తెలిపారు. ఈ ఆఫర్లు నవంబర్ 6 నుండి నవంబర్ 30, 2026 వరకు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేశారు. అంతేకాకుండా, మెగా గోల్డ్ లక్కీ డ్రా ద్వారా 100 మంది విజేతలకు ఒక్కొక్కరికి 5 గ్రాముల చొప్పున మొత్తం 500 గ్రాముల 24 క్యారెట్ బంగారాన్ని బహుమతిగా అందించనున్నట్లు వివరించారు. సరికొత్త డిజైన్లతో కూడిన సంప్రదాయ, ఆధునిక ఆభరణాలతో పాటు వివాహ సీజన్ బ్రైడల్ కలెక్షన్లు అందుబాటులో ఉన్నాయని, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ వేడుకలో కాంగ్రెస్ నాయకులు పన్యాల జైపాల్ రెడ్డి, బబ్బూరి ఆనంద్ గౌడ్, దాచర్లపల్లి శ్రీపాల్ రెడ్డి, పర్వతి గణేష్ రెడ్డి, సునీల్ బాబు, బద్దుల వేణు యాదవ్, బేర బాలకిషన్, జిన్నం వెంకటేశ్వర్లు, మెగావత్ గణేష్ నాయక్, భీమిడి రామకృష్ణా రెడ్డి, శ్రీనివాస్ గుప్త, గోపర్ధన్, శరత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బెబో స్ఫూర్తితో సైజ్ జీరోకి మారిన 'అర్జున్ రెడ్డి' బ్యూటీ



'అర్జున్ రెడ్డి'తో గుర్తింపు తెచ్చుకున్న శాలిని పాండే తన సరికొత్త స్లిమ్ లుక్‌తో సోషల్ మీడియాలో సందడి చేస్తోంది. ఇటీవల ఆమె షేర్ చేసిన డిజైనర్ ఫోటోషూట్ చిత్రాలు వైరల్‌గా మారాయి. అభిమానులు ఆమె గ్లామర్‌ను ప్రశంసిస్తున్నారు. 'మహానటి', '118', 'నిశ్శబ్దం', 'జయేశ్‌భాయ్ జోర్దార్', 'మహారాజ్' వంటి చిత్రాల్లో నటించిన శాలిని ప్రస్తుతం విభిన్న పాత్రలతో తన కెరీర్‌ను కొనసాగిస్తోంది. తెలుగు సినీ పరిశ్రమలో సంచలనం సృష్టించిన –అర్జున్ రెడ్డి– చిత్రంలో బొద్దుగా, అమాయకమైన చూపులతో లవ్లీ –ప్రీతి శెట్టి–గా కుర్రకారు హృదయాలను కొల్లగొట్టిన శాలిని పాండే ఇప్పుడు గ్లామర్ రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. నాడు బాలీవుడ్ బెబో కరీనా కపూర్ ఖాన్ చూపించిన సైజ్ జీరో స్ఫూర్తితో తీవ్రంగా శ్రమించిన ఈ బ్యూటీ, బాగా స్లిమ్ అయి సరికొత్త జీరో సైజ్ అవతారంలోకి మారిపోయింది. ఇటీవల తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన డిజైనర్ డ్రెస్ ఫోటోషూట్‌లో శాలిని అందం కవ్విస్తూ.. ట్రెండీ గ్లామర్‌తో కుర్రకారుకు నిద్రలేకుండా చేస్తోంది. ఈ సరికొత్త ఫోటోషూట్ కోసం స్టైలిస్టులు గౌర్వి దేశాయ్, నూపుర్ అభయ్ పధ్యే, హెయిర్ స్టైలిస్ట్ ప్రతీక్ష ముచండికర్, మేకప్ ఆర్టిస్ట్ సిమువా, ఫోటోగ్రాఫర్ ప్రిషా చందేల బృందం కలిసి పనిచేసింది. ఈ ఫోటోలకు శాలిని సింపుల్‌గా వర్ణనగా సింబాలిక్‌గా ఎమోజీలను క్యాప్షన్‌గా జోడించింది. కొద్ది గంటల్లోనే వైరల్‌గా మారిన ఈ పోస్ట్ కామెంట్ సెక్షన్‌లో అభిమానులు ఫైర్, హార్ట్ ఎమోజీలతో ప్రశంసల వర్షం కురిపించారు.––అందానికి ఒక పేరు ఉంటే అది కచ్చితంగా నీదే–– అంటూ నెటిజన్లు శాలిని స్టైలింగ్‌ను కొనియాడుతున్నారు. అందమైన ప్రశంసలతో పాటు.. శాలిని నటించిన ప్రాజెక్ట్‌లకు సంబంధించిన కొన్ని కామెడీ డైలాగ్‌లు కూడా కామెంట్స్‌లో రీసౌండ్ చేస్తున్నాయి. ప్రత్యేకించి ––దేఖో పాపా మైనే క్యా ఉగాయా హై.. గంజా పాపా గంజా–– అనే పాపులర్ డైలాగ్‌ను గుర్తుచేసుకుంటూ.. ఆ సీన్‌తోనే తాము శాలినికి వీరాభిమానులుగా మారామని పలువురు నెటిజనులు కామెంట్లు చేశారు. మొత్తానికి.. ఈ పోస్ట్ శాలిని పాండే ఫ్యాషన్ సెన్స్, మోడర్న్ గ్లామర్ ..స్లిమ్ లుక్ స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరోసారి చాటిచెప్పడమే కాకుండా.. సోషల్ మీడియాలో ఈ యంగ్ బ్యూటీకి ఉన్న విపరీతమైన క్రేజ్‌ను ప్రతిబింబిస్తోంది. కెరీర్ ప్రయాణం – మైలురాళ్లు: 2017లో విజయ్ దేవరకొండ సరసన నటించిన –అర్జున్ రెడ్డి– చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చి రాత్రికి రాత్రే స్టార్‌డమ్ తెచ్చుకున్న శాలిని పాండే.. ఆ తర్వాత భిన్నమైన పాత్రలను ఎంచుకుంది.

నేను అంత అందంగా లేను.. ఈ స్వచ్ఛతే సీత పాత్రకు ఔచిత్యం!



'రామాయణం'లో సీత పాత్రలో సాయిపల్లవి ఎంపికపై సోషల్ మీడియాలో ప్రశంసలు, విమర్శలు కొనసాగుతున్నాయి. సహజమైన నటన, సంప్రదాయ రూపంతో ఆమె ఈ పాత్రకు సరిపోయిందని అభిమానులు అంటుంటే, మరికొందరు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో సీత పాత్రల ఎంపికపై వచ్చిన వివాదాలు కూడా చర్చకు వస్తున్నాయి. ఈ విమర్శలు, ప్రశంసలను పక్కనపెట్టి సాయిపల్లవి 'రామాయణం పార్ట్ 2'పై దృష్టి పెట్టనున్నట్లు సమాచారం. పాన్ వరల్డ్ సినిమాగా విడుదలైన –రామాయణ– గురించి బోలెడంత చర్చ సాగుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక చిత్రంలోని సీత పాత్ర గురించి కూడా సోషల్ మీడియాల్లో బిగ్ డిబేట్ నడుస్తోంది. అసలు సాయిపల్లవి ఎంపిక సరైనదేనా? అన్న చర్చ ఇప్పటికీ విడుదల తర్వాతా కొనసాగడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సాయిపల్లవిపై కొన్ని విమర్శలు ఎదురవ్వగా.. చాలా ప్రశంసలు కూడా కురుస్తున్నాయి. నిజానికి సాయిపల్లవి తన సహజసిద్ధమైన నటనతో.. ఎలాంటి మేకప్ లేకుండా వెండితెరపై ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అరుదైన నటి. తమిళనాడులోని కోయంబత్తూరులో జన్మించి.. జార్జియాలో ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఈ టాలెంటెడ్ బ్యూటీ నటనపై ఉన్న మక్కువతో చిత్రసీమలోకి అడుగుపెట్టారు. ప్రేమమ్ చిత్రంలో నటించినప్పుడు తాను సిమ్రన్ లా, త్రిషలా అందంగా లేనని కొంత భయపడినట్టు కూడా సాయిపల్లవి ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. అంతేకాదు.. సాయిపల్లవి తమిళనాడులోని కోయంబత్తూరు నివాసి. తాను ఒక మలయాళీ అమ్మాయిని కాదని కూడా వెల్లడించారు. అలాగే తన తండ్రి పడుకర్ తెగకు చెందిన వారు కావడంతో ఆయన పడుకర్ భాష మాట్లాడతారని.. తన తల్లి తమిళియన్ అని కూడా వెల్లడించారు. బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితిష్ తివారీ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించిన పాన్–ఇండియా మైథలాజికల్ ప్రాజెక్ట్ –రామాయణం–లో సీత పాత్రతో చర్చల్లోకొచ్చింది. భారతీయ చారిత్రక, పౌరాణిక కావ్యమైన రామాయణంలో సీత పాత్రకు సాయిపల్లవి నూటికి నూరు శాతం సరిపోతారంటూ సోషల్ మీడియాలో పెద్దఎత్తున ప్రశంసలు కురిసినా కొందరు విమర్శకులు మాత్రం పెదవి విరిచేసారు. ఆమె ముఖంలో ఉండే దైవిక చింతన.. హుందా తనం.. నిండైన సంప్రదాయ రూపం.. స్వచ్ఛమైన మనస్తత్వం ఈ పవిత్రమైన పాత్రకు మరింత వన్నె తెచ్చాయని అభిమానులు బలంగా విశ్వసించారు. సాధారణ హీరోయిన్ల మాదిరిగా కమర్షియల్ హంగులకు పోకుండా... తనకంటూ కొన్ని ప్రత్యేక నైతిక విలువలు పెట్టుకుని ముందుకు వెళ్తున్న సాయిపల్లవికి ఒక డాక్టర్‌గా చదువు పూర్తి చేసుకుని.. ఈ పవిత్రమైన పాత్రను దక్కించుకోవడం కెరీర్‌లోనే పెద్ద మైలురాయి. విమర్శలు సహజం. కానీ చాలా ప్రశంసల్ని కూడా అందుకుంటున్న విషయం మర్చిపోకూడదు. తాను సిమ్రన్ లా, త్రిషలా అందంగా లేకపోయినా ఒక పాన్ ఇండియా ప్రాజెక్టులో అవకాశం అందుకోవడం అంటే అది కేవలం ప్రతిభతోనే సాధ్యమని సాయిపల్లవి నిరూపించారు.

వారణాసి: ఇక స్ట్రాంగ్‌గా మొదలవ్వాలి!

ఏప్రిల్ 7న విడుదల కానున్న మహేష్ బాబు, రాజమౌళి 'వారణాసి' ప్రమోషన్లపై ఆసక్తి పెరుగుతోంది. ఇప్పటికే రుద్ర లుక్, ఇతర పాత్రల పోస్టర్లు, కాన్సెప్ట్ వీడియో, 'సంచారి' పాట విడుదలయ్యాయి. సినిమాలో ఆరు పాటలు ఉన్నట్లు కీరవాణి వెల్లడించడంతో తదుపరి మెలోడీ లేదా మహేష్ మాస్ సాంగ్‌పై అంచనాలు ఉన్నాయి. డిసెంబర్ నుంచి పాటలు, టీజర్, మార్చిలో ట్రైలర్‌తో ప్రచారాన్ని వేగవంతం చేయాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'వారణాసి'కి సంబంధించిన నెక్స్ట్ అప్‌డేట్ కోసం ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ 7న సినిమా విడుదల కానుండగా నవంబర్ కూడా వచ్చేసింది. అంటే చేతిలో ఉన్నది ఐదు నెలల సమయమే. ఇంత భారీ సినిమాకు ఇప్పటినుంచే ప్రమోషన్లు మరింత దూకుడుగా ఉండాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రాజమౌళి గత సినిమాల ప్రచారంతో పోలిస్తే ఈసారి అసలు హడావుడి మొదలవ్వాల్సి ఉందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు మహేష్ బాబు రుద్ర లుక్‌తో పాటు ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్రల పోస్టర్లు వచ్చాయి. కాన్సెప్ట్ వీడియోతో సినిమా విజువల్ స్కేల్‌ను పరిచయం చేశారు. 'సంచారి' పాట కూడా మంచి ఆదరణ పొందింది. అయితే మహేష్, రాజమౌళి కాంబినేషన్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ పాట మరింత పెద్ద స్థాయిలో క్లిక్ కావాల్సిందనే అభిప్రాయాలు వచ్చాయి. అందుకే తర్వాత వచ్చే ప్రమోషనల్ కంటెంట్‌పై అంచనాలు ఎక్కువగా ఉన్నాయి.రాజమౌళి సినిమాలకు పాటలు ఎంత పెద్ద బలమో గతంలో చాలాసార్లు రుజువైంది. 'బాహుబలి'లో 'ధీవర', 'పచ్చబొట్టేసిన' పాటలు ప్రత్యేకంగా నిలిచాయి. 'ఆర్ఆర్ఆర్'లో 'నాటు నాటు' ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. 'కొమురం భీముడో' ఎమోషనల్‌గా ఆకట్టుకోగా, 'దోస్తీ' పాట ఇద్దరు హీరోల బంధాన్ని పరిచయం చేసింది. సినిమా విడుదలకు ముందే పాటలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో రాజమౌళి, కీరవాణి కాంబినేషన్‌కు మంచి ట్రాక్ రికార్డ్ ఉంది. 'వారణాసి'లో ఆరు పాటలు ఉన్నట్లు కీరవాణి గతంలో చెప్పారు. 'సంచారి' తర్వాత మంచి మెలోడీ లేదా మహేష్ బాబు స్టెప్పులతో సాగే పాటను విడుదల చేస్తే ప్రమోషన్లకు మరో ఊపు రావచ్చు. మహేష్ సినిమాల్లో మెలోడీలకు ప్రత్యేకమైన ఆదరణ ఉంటుంది. రాజమౌళి



సినిమాల్లోనూ పాటలను కథకు తగ్గట్టుగా రూపొందిస్తుంటారు. ఈసారి ప్రియాంక చోప్రాతో మహేష్ కాంబినేషన్‌లో వచ్చే పాట ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందనేది చూడాలి. మరోవైపు పాటలతో పాటు ఓ పవర్‌ఫుల్ టీజర్ కూడా ఈ సమయంలో మంచి అప్షన్ అవుతుంది. కాన్సెప్ట్ వీడియోలో రాజమౌళి ఊహించిన ప్రపంచం, భారీ విజువల్స్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఇక మహేష్ బాబు యాక్షన్, డైలాగ్ డెలివరీ, రుద్ర పాత్రలో ఆయన ఇంటెన్సిటీని హైలైట్ చేసే టీజర్ వస్తే అభిమానులకు కావాల్సిన మాస్ కంటెంట్ దొరుకుతుంది. ముఖ్యంగా రాజమౌళి తన హీరోలను పరిచయం చేసే విధానానికి ప్రత్యేకమైన క్రేజ్ ఉంది. పైగా 'వారణాసి'పై తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషల ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలున్నాయి. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ లాంటి నటీనటులు ఉండటం వల్ల హిందీ, మలయాళ మార్కెట్లలోనూ ప్రచారానికి అవకాశం ఉంది. డిసెంబర్ నుంచి పాటలు, టీజర్ వంటి కంటెంట్‌ను వరుసగా తీసుకొస్తే సంక్రాంతి సీజన్‌ను కూడా ప్రమోషన్లకు ఉపయోగించుకోవచ్చు. ఆ తర్వాత మార్చిలో ట్రైలర్, ప్రధాన నగరాల్లో ఈవెంట్లతో ఏప్రిల్ విడుదలకు రంగం సిద్ధం చేసుకోవచ్చు.

ఆదిపురుష్, రామాయణం. తేడా అక్కడే కనిపించింది!

ప్రభాస్ 'ఆదిపురుష్', రణబీర్ కపూర్ నటించిన కొత్త 'రామాయణం' సినిమాల మధ్య పోలికలు చర్చకు వస్తున్నాయి. విజువల్ ఎఫెక్ట్స్, జటాయువు పోరాటం, యశ్ రావణుడి గెటప్‌కు కొత్త సినిమాపై ప్రశంసలు వస్తున్నాయి. అయితే పాటలు, సీతారాముల భావోద్వేగాలు ఆశించిన స్థాయిలో లేవనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. మూడు గంటలకు పైగా



నిడివిపై కూడా కొందరు ప్రేక్షకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారుప్రభాస్ 'ఆదిపురుష్' విడుదలైనప్పుడు ఆ సినిమాపై వచ్చిన విమర్శలు అంత సులభంగా మర్చిపోయేవి కావు. రామాయణం లాంటి గొప్ప కథను భారీ బడ్జెట్‌తో తెరకెక్కించినా ప్రేక్షకులను మెప్పించలేకపోయారు. ముఖ్యంగా విజువల్ ఎఫెక్ట్స్ విషయంలో తీవ్ర నిరాశ ఎదురైంది. దీంతో రణబీర్ కపూర్‌తో మరో రామాయణం తీస్తున్నారనగానే కొందరిలో అనుమానాలు మొదలయ్యాయి. నితీశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కించిన 'రామాయణం' చూసిన తర్వాత రెండు సినిమాల మధ్య తేడా గురించి కామెంట్స్ వస్తున్నాయి.ఆదిపురుష్'లో రావణుడి గెటప్, లంకను చూపించిన విధానం, యుద్ధ సన్నివేశాలపై అప్పట్లో పెద్ద ఎత్తున ట్రోల్స్ వచ్చాయి. కానీ కొత్త 'రామాయణం'లో ఆ స్థాయిలో విజువల్స్‌పై విమర్శలు కనిపించడం లేదు. పైగా డీఎన్ఈజీ, ప్రైమ్ ఫోకస్ స్టూడియోస్ చేసిన వీఎఫ్ఎక్స్ వర్క్ కి ప్రశంసలు వస్తున్నాయి. ముఖ్యంగా జటాయువు పోరాటాన్ని తెరకెక్కించిన విధానం గురించి ప్రేక్షకులు ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. ఈ విషయంలో 'ఆదిపురుష్' కంటే కొత్త సినిమా చాలా మెరుగ్గా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే పాటల విషయానికొస్తే పరిస్థితి తారుమారైంది. 'ఆదిపురుష్' సినిమా ఫలితం ఎలా ఉన్నా అజయ్ అతుల్ అందించిన సంగీతానికి మంచి ఆదరణ లభించింది. ముఖ్యంగా 'జై శ్రీరామ్', 'రామ్ సీతా రామ్' పాటలు విడుదలకు ముందే ప్రేక్షకుల్లోకి బలంగా వెళ్లాయి. సినిమా మీద విమర్శలు వచ్చిన తర్వాత కూడా ఆ పాటలకు గుర్తింపు తగ్గలేదు. కానీ 'రామాయణం' కోసం ఏఆర్ రెహమాన్ పనిచేసినా పాటలు ఆ స్థాయిలో హైలైట్ కాలేదనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. ఇక పాత్రల ఎంపికలోనూ రెండు సినిమాలను పోలుస్తున్నారు. 'ఆదిపురుష్'లో ప్రభాస్ రాముడిగా, కృతి సనన్ సీతగా, సైఫ్ అలీ ఖాన్ రావణుడిగా నటించారు. కొత్త సినిమాలో ఆ పాత్రలను రణబీర్ కపూర్, సాయి పల్లవి, యశ్ పోషించారు. ముఖ్యంగా రావణుడి గెటప్ విషయంలో సైఫ్ ఎదుర్కొన్న విమర్శలకు భిన్నంగా యశ్‌కు ప్రశంసలు వస్తున్నాయి. రణబీర్ నటనకు కూడా మంచి రెస్పాన్స్ ఉండగా, సీతారాముల మధ్య భావోద్వేగాలు మాత్రం ఆశించిన స్థాయిలో లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. 'ఆదిపురుష్'లో రామాయణ కథను ఒకే చిత్రంగా చూపించే ప్రయత్నం చేశారు. కానీ నితీశ్ తివారీ రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నారు. దీంతో జటాయువు పోరాటం వంటి చిన్న ఘట్టాలకు కూడా ఎక్కువ సమయం కేటాయించే అవకాశం దొరికింది. అయితే ఈ నిర్ణయంతో కొన్ని సన్నివేశాలు సాగదీసినట్లు అనిపిస్తున్నాయని, మూడు గంటలకు పైగా నిడివి కూడా ఇబ్బందేనని కొందరు ప్రేక్షకులు చెబుతున్నారు. 'ఆదిపురుష్'కు మరో పెద్ద సమస్య డైలాగ్స్ విషయంలో ఎదురైంది. కొన్ని డైలాగులపై వివాదం రావడంతో మేకర్స్ వాటిని మార్చాల్సి వచ్చింది. కొత్త 'రామాయణం'లో మాత్రం అలాంటి వివాదం లేదు. తెలుగు వెర్షన్‌కు ఆకెళ్ళ శివప్రసాద్ అందించిన మాటలకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇక బాక్సాఫీస్ వద్ద ఎలాంటి కలెక్షన్స్ వస్తాయో చూడాలి.

మళ్ళీ కెమెరా ముందుకు విజయ్... కానీ..!

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరోసారి కెమెరా ముందుకు రానున్నారు. అయితే ఈసారి ఆయన సినిమా కోసం కాకుండా తమిళనాడు ప్రభుత్వానికి సంబంధించిన ఒక యాడ్ లో నటించబోతున్నారు. పూర్తిస్థాయి రాజకీయం వైపు దృష్టి సారించిన విజయ్, తన చివరి చిత్రం 'జననాయగన్' పూర్తి చేసిన తర్వాత సినిమాలకు గుడ్ బై చెప్పారు. ఆ తర్వాత 'తమిళగ వెట్రి కళగం' (tvk) పార్టీకి నాయకత్వం వహించి, మే 2026 లో తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. సీఎం పదవిని చేపట్టినప్పటి నుండి ఆయన చలనచిత్ర రంగానికి మరియు షూటింగ్‌లకు దూరంగా ఉంటున్నారు.తెలుగు సినిమా వార్తలు తాజా సమాచారం ప్రకారం, ఈ ప్రభుత్వ ప్రకటన షూటింగ్ కోసం విజయ్ రెండు రోజుల సమయాన్ని కేటాయించారు. ప్రముఖ దర్శకుడు గౌతమ్ వాసుదేవ్ మీనన్ ఈ యాడ్‌కు దర్శకత్వం వహించనున్నారని, అనుభవజ్ఞులైన సాంకేతిక నిపుణుల బృందం ఈ ప్రాజెక్ట్‌పై పనిచేయనుందని తెలుస్తోంది. సాధారణ ప్రభుత్వ ప్రచార చిత్రాల కంటే భిన్నంగా దీనిని చాలా భారీ స్థాయిలో రూపొందించడానికి ప్లాన్ చేస్తున్నారు. అయితే విజయ్ కెమెరా ముందుకు రావడం కేవలం ప్రభుత్వ సమాచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకేనని, సినిమాల్లోకి తిరిగి వచ్చే ఉద్దేశం ఏమీ లేదని స్పష్టమవుతోంది.



Edited, Printed, Published and Owned by Bavanari Ravi kumar. Printed at M/s Manikanta Enterprises, H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State.
Published at H.No.4-207/12, Balaji Enclave, Jillelguda Village, Saroornagar Mandal, Dist.Rangareddi, Telangana State. Editor: Bavanari Ravi Kumar. RNI No.TELTEL/2014/55197